


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 42, పేజీలు - 08

ఆదివారం, జూన్ 9, 2023 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా

# రాహుల్ గాంధీ

### - ఏకగ్రీవ తీర్మానం చేసిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ


**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారం సాధించడానికి అవసరమైన సీట్లకు కొద్ది దూరంలో ఆగిపోయింది. అదే సమయంలో అటు బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకపోవడంతో మిత్రపక్షాలతో అధికారాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఇండియా కూటమి కూడా అధికారాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేసినా అవి ఇప్పటివరకు ఫలించకపోవడంతో ప్రతిపక్షంలోనే కూర్చుంటామని ప్రకటించింది. అయితే ఇండియా కూటమి ఓడిపోయినా కలిసికట్టుగా పోరాటం సాగించాయని కూటమి నేతలు వెల్లడించారు. ఈ సమయంలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కీలక పదవి అప్పగించాలని నిర్ణయించుకున్నారు. ఇండియా కూటమి ప్రతిపక్ష పాత్ర పోషించనున్న నేపథ్యంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉండాలని కాంగ్రెస్ వర్కింగ్

6లో ▶



# బీఆర్ఎస్ పునరుజ్జీవానికి ప్లాన్లేంటి.?

### - వలసల్ని ఆపగలరా.?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజకీయాలంటే ఎప్పుడూ విజయాలు ఉండవు. కానీ గట్టిగా ప్రయత్నించకపోతే ఎప్పుడూ అపజయాలు ఉంటాయి. వరుస ఓటములు వస్తే మరోసారి ప్రయత్నించడానికి కూడా అవకాశం రానంత స్థితికి పార్టీలు వెళ్లిపోతాయి. పరిస్థితి బాగున్నప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా కలసి వస్తుంది. పార్టీ నేతల్ని చాణక్యుడని పొగుడుతారు. కలసి రానప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా రివర్స్ అవుతుంది. కేసీఆర్ పద్నాలుగేళ్ల పాటు చాణక్యునిగా పేరు తెచ్చుకున్నారు. అన్ని నిర్ణయాలు కలసి వచ్చాయి. కానీ రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని ఇప్పుడు నిరూపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు రాకపోగా ఎనిమిది చోట్ల డిపాజిట్లు కోల్పోయారు. మూడు అంటే మూడు అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే మెజార్టీ కనిపించింది. ఇది అత్యంత గడ్డు పరిస్థితే.

#### బీఆర్ఎస్‌కు గడ్డు కాలం

భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ చీఫ్ కేసీఆర్‌కు ఇప్పుడు కష్టకాలం. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాలేదు. ఇంకా డీప్‌గా అనాలసిస్ చేస్తే మూడు అసెంబ్లీ సీట్లలో మాత్రమే ఆధిక్యం వచ్చింది. ఎనిమిది లోక్ సభ సీట్లలో డిపాజిట్లు కోల్పోయారు. వినడానికి కాస్త అతిశయంగా ఉన్నా లోక్ సభ ఎన్నికల పోలింగ్ ఫలితాలు ఇదే విషయాన్ని వెల్లడించాయి. తెలంగాణలో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆధిక్యాలను పరిశీలిస్తే బీఆర్ఎస్ పార్టీకి మూడు చోట్ల మాత్రమే ఆధిక్యత లభించింది. లోక్ సభ ఎన్నికల్లో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఆధిక్యతలను చూస్తే కాంగ్రెస్ పార్టీ తన స్థానాలు కొన్ని మారినా మొత్తంగా 64 సీట్లలో ఆధిక్యాన్ని చూపించుకుంది. బీజేపీ ఏకంగా 45 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యాన్నిచూపించింది. మజ్లిస్ పార్టీ తన ఏడు సెగ్మెంట్లలో ఆధిక్యాన్ని నిలుపుకుంది. నాంపల్లిలో మాత్రం వెనుకబడింది. అక్కడ కాంగ్రెస్ ది ఆధిపత్యం అయింది. బీఆర్ఎస్ కు మాత్రం మూడు సెగ్మెంట్లలోనే ఆధిక్యం వచ్చింది.నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39సీట్లను సాధించుకుంది. కాంగ్రెస్ మిత్రపక్షంతో కలిసి అరవై ఐదు గెల్చుకోగా బీజేపీ ఎనిమిది దగ్గర

6లో ▶

## అమెరికా పర్యటనలో తెలంగాణ మంత్రులు

### - పెట్టుబడుల కోసం బడా కంపెనీలతో చర్చలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు మంత్రులు అమెరికాలో పర్యటిస్తున్నారు. ఐటీ పరిశ్రమల శాఖామంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అట్లాంటాలోని కోకా-కోలా హెడ్ క్వార్టర్స్ లో కంపెనీ అంతర్జాతీయ ప్రభుత్వ సంబంధాల విభాగ గ్రూప్ డైరెక్టర్ జోనథన్ రీఫ్ తో సమావేశమయ్యారు. ఇరువురు నేతలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోకా-కోలా మేనేజ్ మెంట్ ను ఆహ్వానించారు. దాదాపు గంటన్నర సేపు జరిగిన సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులను విజువల్

6లో ▶




## ప్రజాజీవితంలో లేని పవర్ ఫుల్ లీడర్

# రామోజీరావు

### - తలవంచని మీడియా ప్రతిపక్ష సారధి

## రామోజీరావు కన్నుమూత

**ఈనాడు మీడియా, ఉషా కిరణ్ మూవీస్ అధినేత, రామోజీ ఫిల్మ్ సిటీ ఫౌండర్ రామోజీ రావు (87) శనివారం ఉదయం కన్నుమూశారు. శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన్ను హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. కానీ శనివారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని ఫిలింసిటీలోని నివాసం వద్దకు తరలించారు. నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేయనున్నారు. ఆయన మరణంతో మీడియా, సినీలోకం దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తోంది. టాలీవుడ్‌లో ఉషా కిరణ్ మూవీస్ ద్వారా రామోజీ రావు ఎంతో మంది యంగ్ టాలెంటెడ్ ఆర్టిస్టులను, టెక్నీషియన్లను పరిచయం చేశారు.**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రామోజీరావు ఎవరు ? ఓ ఎంపీగా ఎప్పుడూ చేయలేదు, ఓ ఎమ్మెల్యే అసలే కాదు. ఎప్పుడూ ప్రత్యక్ష రాజకీయాలు చేయలేదు. కానీ ఆయన ముద్ర మాత్రం రాజకీయాల్లో పవర్ ఫుల్ గా ఉంటుంది. ఇది నాటి ఇందిరా గాంధీ నుంచి నేటి జగన్ వరకూ సాగింది. తాను నమ్మిన సిద్ధాంతానికి మాత్రమే రామోజీరావు బద్ధుడు. ప్రజా వ్యతిరేకంగా ఏమున్నా ఆయన నిస్సంకోచంగా వ్యతిరేకిస్తాడు.

#### మీడియాను ప్రజాస్వామ్య ప్రతిపక్షంగా మలిచిన ధీరుడు

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియా. మీడియా అంటే పాలకపక్షానికి ఎప్పుడూ ప్రతిపక్షమే. ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రజాసమస్యలను ఆయన ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు కఠినమైన మార్గాన్నే ఎంచుకున్నారు. సమస్య తీవ్రతను బట్టి ప్రభుత్వాలపై అంతే కఠినంగా ప్రశ్నించేవారు.

6లో ▶

## రామోజీరావు పార్థివదేహానికి

# ప్రముఖుల నివాళులు

### - కుటుంబసభ్యులను ఓదార్చిన టీడీపీ అధినేత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు పార్థిక దేహానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. ఢిల్లీ నుంచి మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో కలిసి రామోజీరావు పార్థిక దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన చంద్రబాబు రామోజీరావు ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు. రామోజీరావు ఓ వ్యక్తి కాదు వ్యవస్థగా అభివర్ణించారు.

6లో ▶

## నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలు

### - హై లెవల్ కమిటీతో విచారణకు కేటీఆర్ డిమాండ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రతిష్టాత్మక నీట్ ఎగ్జామ్ లో జరిగిన అవకతవకలపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. నీట్ లో అవకతవకలపై హై లెవల్ ఎక్స్ పర్ట్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నీట్ ఎగ్జామ్‌లో జరిగిన అవకతవకలపై ట్విట్టర్ వేదికగా స్పందించారు. కొత్తగా ఏర్పాటు అవుతున్న ఎన్డీయే ప్రభుత్వ ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.



#### అంతమందికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది?

ఎన్డీయే ప్రభుత్వం ఎదుర్కనే సవాళ్లలో విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ ఎగ్జామ్ రిజల్ట్ 2024 చాలా సున్నితమైన అంశమన్నారు.

6లో ▶

## అధికారిక లాంఛనాలతో

## రామోజీ అంత్యక్రియలు

### - అధికారులకు ఆదేశాలు

### - తీరని లోటు అంటూ రేవంత్ రెడ్డి ట్వీట్

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖుల సంతాపం వ్యక్తం చెబుతున్నారు. రామోజీ రావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించారని గుర్తుచేశారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని

6లో ▶



# ఆరోగ్యశ్రీలో 65 కొత్త చికిత్సలు

### - నిధులు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్సలు చేర్చగా, 1375 పాత చికిత్స విధానాలకు నగదు ప్యాకేజీ పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులకు చికిత్స, ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ పథకంలోని చికిత్సల ప్యాకేజీ ధరల్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. వీటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం, కాగా శనివారం (జూన్ 8న) డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ నిధులను విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

#### 2007లో కాంగ్రెస్ తీసుకొచ్చిన పథకం ఆరోగ్యశ్రీ

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద కొత్త చికిత్సా విధానాల కోసం, ప్రస్తుతం ఉన్న పథకాల ఆర్థిక సవరణ కొరకు రాష్ట్ర సచివాలయంలో మంత్రి భట్టి విక్రమార్క మల్లు సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వము 2007 లో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టడం తెలిసిందే. ఈ పథకం కింద 2.84 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 10 లక్షల వరకు ఆర్థిక సహాయం ఈ పథకం ద్వారా అందుతోంది. రాష్ట్రం లో 1402 ఆసుపత్రుల ద్వారా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిధిలో 1672 చికిత్సా విధానాలు అందుబాటులో వున్నాయి. ఇందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూసకు సంబంధించిన 65 అధునాతన ట్రీట్మెంట్‌లను ఇకనుంచి ఆరోగ్యశ్రీలో



6లో ▶

# నేడే ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం

### - రాష్ట్రపతి భవన్‌లో భారీగా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో, ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ అందుకు వేదికగా నిలవనుంది. నేడు రాత్రి 7.15 గంటలకు మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 8 వేల మంది అతిథులు హాజరవుతారని అంచనా. ఎన్డీయే కూటమి నేతలు, విపక్ష నేతలు, సినీ ప్రముఖులు, క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు, ఇతర రంగాల ప్రముఖులు మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి



రానున్నారు. శ్రీలంక, మాల్దీవులు, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మారిషస్ తదితర దేశాల అధినేతలు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని భావిస్తున్నారు. 2014లో మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి సార్క్ దేశాల అధినేతలు హాజరయ్యారు. 2019లో ప్రమాణ స్వీకార వేడుకకు బిమ్స్ టెక్ కూటమి దేశాల అధినేతలు పాల్గొన్నారు. కాగా, ఈసారి మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సెంట్రల్ విస్టా సముదాయం నిర్మాణ కార్మికులు, వందే భారత్ ప్రాజెక్టులో పనిచేసిన సిబ్బందికి, వికసిత్ భారత్ పథకాల అంబాసిడర్లకు కూడా ఆహ్వానాలు పంపినట్టు తెలుస్తోంది.

6లో ▶

# విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి

- మంథని సీ.ఐ ఎన్.వెంకటేశ్వర్లు



**మంథని ( ప్రశ్నన్యూస్)** విద్యతో పాటు క్రీడలపై విద్యార్థులు దృష్టిసారించాలని మంథని సీఐ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి స్టేడియంలో శనివారం ఉదయం స్థానిక అండర్-14 చిన్నారుల మధ్య స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్ ను ఆయన ప్రారంభించారు. ప్రతి విద్యార్థి జీవితంలో విద్యకు ఎంత ప్రాధాన్యమిస్తారో , అదే తరహాలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక శ్రమ లభిస్తుందని, ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. అండర్-14 'ఏ' జట్టు, 16 ఓవర్లలో 186/3 పరుగులు చేయగా, 'బీ' జట్టు182/7 పరుగులు సాధించింది. ఈ కార్యక్రమంలో రామగిరి ఆర్ఎంపీల సంఘం అధ్యక్షులు డాక్టర్ బొద్దుల జగన్, సూదుల ఐలయ్య, సంగెం రాజేందర్, పార్థు, పీవీరావు, తిరుపతి రెడ్డి, బొడిగే శ్రీధర్, తన్నీరు ప్రదీప్, కెప్టెన్లు పల్లెసాక్షిత్ రావు,పుల్లెల సంప్రీత్ తదితరులు పాల్గొన్నారు.

## రామోజీ రావు మరణం
## తెలుగు జర్నలిజానికి తీరని లోటు

- రామోజీరావు సమాజ హితం కోసం పనిచేశారు
- రామోజీరావు లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం
- తెలుగుజాతికి రామోజీరావు మార్గదర్శి
- రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరా
- తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు



**ఓజిలి (ప్రశ్న న్యూస్)** ఈనాడు అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత చెరుకూరి రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఓజిలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు మాట్లాడుతూ రామోజీ రావు మరణం అత్యంత విషాదకరం. ఆధునిక జర్నలిజానికి పితామహుడిగా నిలిచిన రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటు. ఆయన అనేక సంస్థలను ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించారు. నిరంతరం ప్రజల మంచికోసం, సమాజహితం కోసం పరితపించి పని చేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు. రామోజీ మరణం తెలుగు ప్రజలకే కాదు దేశానికి కూడా తీరని లోటు అని ఆయన అన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా' అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు అన్నారు.తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలుగు పత్రికా, మీడియా రంగానికి రామోజీరావు గారు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ%ొ% కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు అన్నారు.

## రామోజీరావు చిత్రపటానికి
## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నివాళులు



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** రామోజీ గ్రూప్స్ అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా యాదగిరిగుట్టలో అమరవీరుల స్తూపం వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.ఎమ్మెల్యేతో పాటు శ్రద్ధాంజలి ఘటించిన ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, అన్ని పార్టీల నాయకులు, జర్నలిస్టులుయాదగిరిగుట్ట పట్టంణంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట మీడియా మిత్రులు,కాంగ్రెస్ నాయకులతో కలిసి ఈనాడు అధినేత రామోజీరావు రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రామోజీరావు మరణం తెలుగు దిన పత్రికా మీడియా వ్యాపార రంగాలకు తిరని లోటని అన్నారు.తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావు దక్కుతుందని అక్షర వీరుడు రామోజీరావు ఆత్మ శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మోడీ ప్రమాణానికి భారీ ఏర్పాట్లు

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 9వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. విదేశాధినేతలూ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ క్రమంలోనే భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశ రాజధానిని భద్రతా బలగాలు మోహరించాయి. హైఅలెర్ట్ ప్రకటించారు. పలు అంచెల భద్రత ఏర్పాటు చేశారు. పారామిలిటరీకి చెందిన 5 దళాలు, ఔుఉ కమాండోలు సెక్యూరిటీ అందించున్నాయి. వీటితో పాటు అణువణువునా నిఘా పెట్టేందుకు డ్రోన్‌లను రంగంలోకి దించారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం జరగనున్నందున ఆ పరిసరాల్లో స్నైపర్స్‌నీ ఏర్పాటు చేయనున్నారు. సార్క్ దేశాల తరపున పలువురు ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. గతేడాది ఉ20 సమావేశాలకు ఎలాంటి భద్రత అయితే ఏర్పాటు చేశారో..అదే స్థాయిలో ఇప్పుడూ సెక్యూరిటీ ఇవ్వనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చే ముఖ్య అతిథులు హోటల్ నుంచి వేదిక వరకూ ఎలా రావాలో ముందే ఓ రూట్ మ్యాప్ ఇస్తామని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు ఓ నోటీస్ విడుదల చేశారు. ఆ రోజున డ్రోన్‌లు కానీ, పారా మోటార్స్, పారా గ్లైడర్స్ కానీ హాట్ ఎయిర్ బెలూన్స్ కానీ ఎగరేయడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. స్నైపర్స్‌తో పాటు సాయుధ బలగాలతో గస్తీ కాయనున్నారు. ఢిల్లీవ్యాప్తంగా వ్యూహాత్మక ప్రాంతాల్లో డ్రోన్‌లను ఎగరేస్తూ నిఘా పెట్టనున్నారు. బంగ్లాదేశ్ ప్రధానితో పాటు భూటాన్, నేపాల్, మారిషస్, మాల్దీవ్స్ దేశాధినేతలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరు కానున్నారు. వీళ్లంతా లీలా, తాజ్, ఐటీసీ మౌర్య, ఒబెరాయ్ హోటల్స్‌లో బస చేయనున్నారు. ఇక్కడా భద్రతను పెంచారు. ంఎ టెక్నాలజీని వినియోగించనున్నారు. ట్రాఫిక్ మళ్లింపుల వివరాలనూ పోలీసులు వెల్లడించారు.

## ప్రజాతీర్పును స్వాగతిస్తాం
# అభివృద్ధిని ప్రోత్సహిస్తాం

- కార్యకర్తల జోలికొస్తే సహించం
- వాస్తవాలు గ్రహించి మాట్లాడాలి - ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** సార్వత్రిక ఎన్నికలలో ప్రజా తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. శనివారం సనత్ నగర్లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల ఫలితాలు బాధను కలిగించినా ప్రజా తీర్పును స్వాగతిస్తామన్నారు. సుధీర్ఘంగా రాజకీయాలలో ఉంటూ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, వైసీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. ఇకపై కూడా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తల జోలికొస్తే మౌనంగా ఉండబోమన్నారు. న్యాయమైన పోరోటాలు సాగిస్తామన్నారు. అవసరమైతే కోర్టులను కూడా ఆశ్రయిస్తామన్నారు. తిప్పవరప్పాడులో ట్రీ కటింగ్ టెండర్ ప్రక్రియతోనే నిర్వహించారన్నారు. అధికారంలో ఉన్నామని అబద్దాలను నిజం చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. హూందాగా వ్యవహరించాలని హితవు పలికారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా పనిచేసుకు వెళ్లడమే తన అభిమతమన్నారు. ప్రతి పక్షంలో తనకు కొత్తేమీ కాదన్నారు. రాష్ట్ర మంతా ప్రజలు మార్పును కోరుకున్నారు. స్వాగతిస్తున్నామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన వాతావరణం కనిపిస్తోందన్నారు. అధికారాన్ని చేతిలోకి తీసుకునే ప్రయత్నం చేస్తే పోరాడుతామన్నారు. ఎన్నికలలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు, 80వేల పై చిలుకు ఓట్లు వేసిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి గురుమూర్తి గెలుపు సంతృప్తినిచ్చిందన్నారు. వైసీపీ పట్టణాధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన ధర్మరాజులస్వామి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులందరూ రాజీనామాలు చేయనున్నట్లు ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన వారందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ. మగ్ధూమ్ మొహిద్దీన్,

## వ్యక్తి నుంచి ఓ వ్యవస్థగా ఎదిగిన
## అక్షర యోధుడు రామోజీరావు

- గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు
- సీనియర్ పాత్రికేయులు ఎస్.కే. జమాలుల్లా
- మీడియా రంగానికి రామోజీరావు లేని లోటు పూడ్చలేనిది
- ప్రధాన కార్యదర్శి, షోకాజ్ దినపత్రిక సంపాదకులు ఉడతా శరత్ యాదవ్
- రామోజీరావు మృతికి గూడూరు పాత్రికేయుల సంతాపం



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** వ్యక్తి నుంచి ఓ వ్యవస్థగా ఎదిగిన అక్షర యోధుడు రామోజీరావు గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీనియర్ పాత్రికేయులు ఎస్.కే. జమాలుల్లా అన్నారు. శనివారం గూడూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో రామోజీ గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి పాత్రికేయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావుకే దక్కుతుందన్నారు. 1936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో రామోజీరావు జన్మించారని, ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారన్నారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారన్నారు.

ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారిందన్నారు. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా సితార సినీ పత్రిక నిలిచిందన్నారు. బహుముఖ ప్రజ్ఞ.. కఠోర సాధన, ఇదే రామోజీ అస్త్రాలన్నారు. నలుగురు నడిచిన బాట కాదు కొత్త దారులు సృష్టించడం ఆయన నైజమన్నారు. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడన్నారు. సామాన్య రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారన్నారు.

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, షోకాస్ దినపత్రిక సంపాదకులు ఉడుతా శరత్ యాదవ్ మాట్లాడుతూ రామోజీరావు మరణించడం చాలా బాధాకరమన్నారు. భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చినదార్శనికుడన్నారు. జర్నలిజం, సినీ ప్రపంచంపై చెరగని ముద్ర వేసేశారన్నారు. మీడియాలో రామోజీరావు సరికొత్త ప్రమాణాలను నెలకొల్పారని, ఆయన్నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నామన్నారు. నిజాలను ప్రజలకు చేరవేయాలి, ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేసేలా ఉండాలని తపించే వ్యక్తి చెరుకూరి రామోజీరావు అన్నారు. ఎక్కడో చిన్న రైతు కుటుంబంలో పుట్టి అచంచలమైన కష్టంతో ప్రపంచం మెచ్చే వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన తీరు అనితర సాధ్యమన్నారు. ఎన్నో ఆటుపోట్లు.. మరెన్నో అవమానాలు అన్నింటినీ ఎదురొడ్డి, రామోజీరావు ఈ స్థాయికి చేరారన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఈనాడు అనే మీడియా వ్యవస్థను స్థాపించి ప్రజలకు తోడుగా నిలిచారు. మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి లాంటి ఎన్నో వ్యాపార సంస్థల్ని స్థాపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేశారు. అతి తక్కువ సమయంలోనే జాతీయస్థాయి నెట్ వర్క్ గా ఈటీవీని విస్తరించారన్నారు. జనగర్జన సంపాదకులు సీనియర్ మనోహర్ రెడ్డి, తులసిరాజు, సురేష్, గుమ్మడి అనిల్ కుమార్ (నాని), శివ కుమార్, కిషోర్ నాయుడు, వెంకయ్య, రాజు, యువ పాత్రికేయులు లక్ష్మణ్, నిరంజన్, కృపా నిధి, వినయ్ కుమార్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# చేప ప్రసాదంలో క్యూలో వ్యక్తి మృతి

**హైదరాబాద్** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీలో విషాదం జరిగింది. క్యూ లైన్ నిలబడ్డ ఓ వ్యక్తి తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయాడు. అతడిని పోలీసులు వెంటనే స్థానిక కేర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి నిజమాబాద్ కు చెందినట్లు సమాచారం..

# ఆ ఇద్దరు ఎవరు...

**హైదరాబాద్ :** గతంలో నాలుగు సీట్లు ఉన్నాయి. ఒక్కటి అదనంగా గెలిచినా చాలు.. అది మాకు బోనస్సే.. ఇది లోక్‌సభ ఎలక్షన్స్ ముందు బీజేపీ నేతల మాటలు.. బట్ ప్రజలు మాత్రం వారి అంచనాలకు మించి సీట్లు ఇచ్చారు. ఏకంగా ఎనిమిది మంది బీజేపీ అభ్యర్థులను గెలిపించారు. మరి ఇది తెలంగాణకు మంచి చేయబోతుంది? గెలిచారన్న సంతోషమేనా? మరి మనకు జరిగే లాభం ఏమైనా ఉందా? ప్రజలు ఆశీర్వదించారు.. మేము అనుకున్నదానికంటే చాలా బాగా పోరాడాము.. ఇవి తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి చెబుతున్న మాటలు.. యస్.. నిజంగానే మొత్తం 17 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు కాంగ్రెస్ అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో బీజేపీ ఈ స్థాయిలో సీట్లు గెలుచుకోవడం ఇదే ఫస్ట్ టైమ్.. మరి తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎలాంటి రిటర్న్ గిఫ్ట్ ఇస్తుంది? రాష్ట్రానికి ఏం మేలు చేస్తుంది? ఇదే ఇప్పుడు మెయిన్ క్వశ్చన్.లాస్ట్ లోక్‌సభ ఎలక్షన్స్‌లో తెలంగాణలో నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకుంది. ఇప్పటి బీఆర్ఎస్.. అప్పటి టీఆర్ఎస్ హవా నడుస్తున్న సమయం అది. ఆ హవాలో కూడా అనూహ్యంగా నాలుగు ఎంపీ సీట్లను కైవసం చేసుకుంది బీజేపీ. దీనికి ప్రతిఫలంగా ఒక కేంద్ర సహాయమంత్రి పదవిని కల్పించింది అప్పటి మోడీ సర్కార్.. బస్.. అంతే.. అంతకుమించి రాష్ట్రానికి జరిగిన వృద్ధి ఏం లేదనేది ఇప్పటికీ ఉన్న విమర్శలు. ప్రాజెక్టులు, నిధుల విషయంలో కూడా కేంద్ర నుంచి తెలంగాణకు ఒరిగిందేం లేదన్న టాక్ ఉంది. కానీ ఈసారి సిట్యూవేషన్ వేరు. కాస్త అన్యాయం జరిగిందని ప్రచారం జరిగినా.. తెలంగాణ ప్రజలు దానిని పక్కన పెట్టారు. బీజేపీకి జై కొట్టారు.. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించారు. మరి ఈసారైనా న్యాయం జరుగుతుందా? తెలంగాణ బీజేపీ ఎంపీలకు కీలకమైన మంత్రిత్వశాఖలు దక్కుతాయా ఇప్పుడు దీనిపైనే తెలంగాణ పొలిటికల్ సర్కిళ్లలో హాట్ డిబేట్ నడుస్తుంది..అయితే ఈసారి నలుగురికి మంత్రి పదవులు దక్కుతాయన్న చర్చ నడుస్తుంది. నిజానికి బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ ఎంపీలుగా గెలవడం ఇది రెండోసారి.. సో.. వీరిద్దరు కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. తొలిసారి విజయం సాధించిన డీకే అరుణ, ఈటల రాజేందర్ కూడా మంత్రి పదవి రేసులో ఉండే చాన్స్ ఉంది. గతంలోనే కిషన్ రెడ్డి మంత్రి పదవి దక్కించుకున్నారు కాబట్టి.. ఆయనకు ఈసారి మళ్లీ పదవి ఇస్తారా? లేదా? అనేది డౌట్.. బీసీ కోటాలో ఈటలకు లేదా బండి సంజయ్‌కు.. మహిళా కోటాలో డీకే అరుణకు పదవీయోగ్యం దక్కే చాన్స్ ఉంది.అయితే బీజేపీకి పూర్తి స్థాయిలో మెజార్టీ రాకపోవడం చాలా మంది ఆశావాహులకు దెబ్బ అనే చెప్పాలి. ఎందుకంటే బీజేపీ మిత్ర పక్షాలు డిమాండ్స్ పెరిగిపోయాయి. తమకు కావాల్సిన మంత్రి పదవులు ఇన్ని.. శాఖలు ఇవి..అంటూ చాంతాడంతా లిస్టను బీజేపీ పెద్దల ముందు ఉంచుతున్నారు. సో.. ఎక్కువ సంఖ్యలో మంత్రి పదవులు మిత్ర పక్షాలకు వెళితే.. చాలా వరకు బీజేపీ ఆశావాహులకు పదవులు దక్కే అవకాశం ఉండకపోవచ్చు. అందులో తెలంగాణ బీజేపీ ఎంపీలు ఉండే అవకాశం కూడా లేకపోలేదు.అయితే మోడీ సర్కార్ చాలా విషయాల్లో తెలంగాణకు మొండి చేయ్యే చూపించిందని చెప్పాలి. ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తామన్నారు. దానిని నాన్చి నాన్చి.. చివరకు మరమ్మతుల కేంద్రంగా మార్చేశారు. అది కూడా ఎన్నికల ముందు ప్రకటించారు. ఇక నిజామాబాద్ పసుపు బోర్డు కూడా.. ఐదేళ్లు నాన్చి నాన్చి.. దానిని కూడా సరిగ్గా ఎన్నికల ముందు అనౌన్స్ చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ అయితే అటకెక్కింది. ట్రైబల్ యూనివర్సిటీ డీపీఆర్‌కే పరిమితమైంది. మామునూరు ఎయిర్‌పోర్ట్ విషయమైతే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా ఉంది. ఇవన్నీ పాత ప్రాజెక్టులో.. మరి వీటిని పూర్తి చేసి మమ అనిపిస్తారా? లేక కొత్త వాటిని ఏమైనా రాష్ట్రానికి తీసుకొస్తారా? అనేది చూడాలి.యస్.. ఈటల రాజేందర్ చెప్పింది నిజమే. ఎన్నో కలలతో బీజేపీ ఎంపీలను గెలిపించారు తెలంగాణ ప్రజలు. మీ పార్టీ ఓట్ షేర్‌ను పెంచారు. మీరు కూడా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకండి. తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయండి.

## పార్టీలు మారినా... మారని తలరాతలు

**వరంగల్ :** ఎన్నికలు రాగానే మొదట టికెట్ కోసం ఎదురుచూస్తారు, ఛాన్స్ లేదనుకుంటే చాలు ఆ పార్టీపై విమర్శలు, ఆరోపణలు చేసి మరో పార్టీలోకి జంప్ అవుతుంటారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ముందు తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ లోకి మారి టికెట్ దక్కించుకొన్న కొందరు నేతలు ఓటమి పాలయ్యారు. భారత రాష్ట్ర సమితి అధికారానికి దూరం కాగానే ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కొందరు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరగా, మరికొందరు సిట్టింగ్ ఎంపీలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మారిన నేతలు ఎన్నికల్లో పోటీ చేయగా ఒకే ఒక్కరు విజయం సాధించారు. మిగతా వారికి మాత్రం నిరాశే మిగిలింది. గెలిచిన ఆ ఒక్క అభ్యర్థి వరంగల్ ఎంపీ కడియం కావ్య. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో నేతలను ఆ పార్టీ ఈ పార్టీ నేతలు అని చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని దుస్థితి. అధికార పార్టీలో ఉంటే నాయకులు ప్రతిపక్ష పార్టీలో ఉంటే నాయకులం కాదు. అనే విధంగా రాజకీయ నాయకుల వ్యవహార శైలి మారింది. ఏళ్ల తరబడి అధికారంలో ఉన్న అధికారానికి దూరమైన కొద్ది రోజులకే నేతలు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంప్ అవుతున్నారు. ఇలాంటి పరిస్థితి మొన్నటి లోక్‌సభ ఎన్నికల ముందు జరిగింది. భారత రాష్ట్ర సమితి అధికారానికి దూరం కాగానే ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. అంతే కాదు సీట్లు దక్కించుకుని పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేశారు. ఇలా బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన వారిలో చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఆయన భార్య సునీతా మహేందర్ రెడ్డి, స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కడియం కావ్య ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్ రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ నుంచి, సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉన్న దానం నాగేందర్ సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి, పట్నం సునీతా మహేందర్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి, కడియం కావ్య వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే పార్టీ మారినా వారి ఫేట్ మాత్రం మారలేదు. అధికార పార్టీలో ఉంటే విజయం తథ్యమని భావించిన ఈ నేతలకు నిరాశే ఎదురైంది. చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతిలో రంజిత్ రెడ్డి ఓటమి చెందారు.మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన సునీతా రెడ్డి.. ఈటల రాజేందర్ చేతిలో 3,91,475 ఓట్ల తేడాతో గెలుపొందారు. సికింద్రాబాద్‌లో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ కిషన్ రెడ్డి చేతితో 49,944 ఓట్ల తేడాతో దానం నాగేందర్ కు ఓటమి తప్పలేదు. అయితే పార్టీ మారిన వారిలో వరంగల్ లో కడియం కావ్య ఒక్కరే విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ పై 2,20,339 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించారు. ఇక్కడ ప్రత్యర్థి అంత స్ట్రాంగ్ కాకపోవడంతో కావ్య గెలుపొందారని వినిపిస్తోంది. అధికారం కోసం రాత్రికి రాత్రి పార్టీలు మారినా, ఎన్నికల్లో ఓటు వేయకుండా వారిని ప్రజలు ఓడించి ఇంటికి పంపినట్లు అయింది.

## కారు దిగడానికి మరి కొందరు ఎమ్మెల్యేలు

**హైదరాబాద్ :** కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ కొలువు తీరబోతోంది. ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవనున్నారు. తెలంగాణలోని లోక్షభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుండు సున్నానే మిగిలింది. ఏపీలోనూ కేసీఆర్ దోస్త్ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్ల సంఖ్య అటుంచితే.. చెప్పుకోదగ్గ స్థానాలను కూడా వైసిపి సాధించలేదు. దీంతో ఈ మొత్తం వ్యవహారంలో ఎటు చూసినా..బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు పెద్ద మైనస్ గా మారింది. వాస్తవానికి తెలంగాణలో కొన్నైనా లోక్షభ స్థానాలను గెలుచుకుంటామని గులాబీ అధినాయకత్వం అంచనా వేసుకుంది. తద్వారా కేంద్రంలో తాము చక్రం తిప్పేందుకు ఆస్కారం ఉంటుంది ఆ పార్టీ ఎక్స్పెక్ట్ చేసింది. ఒకవేళ రాష్ట్రంలో అనుకున్న స్థాయిలో లోక్షభ స్థానాలు రాకున్నా..ఏపీలో తన మిత్రుడు జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవతారని భావించింది.పై కారణాలు చెప్పే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇన్నాళ్లు తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోగలిగారు. ఆంధ్రాలో జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితే తమకు కాస్త రిలీఫ్ ఉంటుందని లేదా తెలంగాణ లో ఎక్కువ లోక్షభ స్థానాలను గెలుచుకున్నా?తమకు ధోకా ఉండదని వారికి నచ్చ చెప్పుకున్నారు. అయితే ఇవేవీ వర్కౌట్ కాకపోవడంతో.. ఇప్పుడు తెలంగాణ భవన్ నుంచి ఒక్కొక్కరు కాంగ్రెస్ లేదా బిజెపి వైపు వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే మాజీమంత్రి మల్లారెడ్డి,ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితులు వేం నరేందర్ రెడ్డితో సంప్రదింపులు జరిపి ఆ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అలాగే వీరి బాటలోనే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,లక్ష్మారెడ్డిలు కూడా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. వాస్తవానికి గత శాసనసభ ఎన్నికల సందర్భంగా గులాబీ పార్టీ గ్రేటర్ లోనే అత్యధిక స్థానాలను గెలుచుకుంది. ఇప్పుడు ఇక్కడి నుంచే ఎమ్మెల్యేలు కారు దిగేందుకు సిద్ధపడటం కేసీఆర్ ను ఆందోళనకు గురిచేస్తుంది.ఇక పార్టీ మారే విషయంలో కెసిఆర్ కు మల్లారెడ్డి,రాజశేఖర్ రెడ్డి,సుధీర్ రెడ్డి,లక్ష్మారెడ్డిలు ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశారు. తాము కాంగ్రెస్ లోకి పోవడం తప్ప మరో మార్గం లేదని తేల్చి చెప్పేశారు. ఇదే విషయం బీఆర్ఎస్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అంతేకాక వీరితోపాటు మరి కొంతమంది ఎమ్మెల్యేలు కారు దిగిపోతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

దీంతో వెంటనే అలర్ట్ కెసిఆర్ మల్లారెడ్డి, రాజశేఖరరెడ్డి,లక్ష్మారెడ్డి,సుధీర్ రెడ్డిలను ఫాంహౌజుకు పిలిపించుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికి వారి నుంచి సానుకూల దృక్పథం రాకపోవడంపై కెసిఆర్ కొంత అసహనానికి గురైనట్లు తెలుస్తుంది. అయితే వీరి పార్టీ మార్పును అడ్డుకునేందుకు కెసిఆర్ ఆ నలుగురు ఎంఎల్ఏలతో దిగిన ఫోటోను కావాలనే వైరల్ చేయించినట్లు టాక్. తద్వారా వీరు పార్టీ మారడం లేదనే సంకేతాలను పంపే ప్రయత్నం చేసినట్లు అర్థమవుతుంది.

# వెలుగులోకి అరుదైన 'వీరగల్లు' శిల్పాలు

- వీరుల త్యాగానికీ చిరస్మరణీయతకూ గుర్తు వీరగల్లు
- ఆ ఏడుగురు వీరులే ఈ వీరగల్లులు
- నాటి నుండి నేటి వరకు వీర్నపల్లికి చరిత్రలో ప్రత్యేక స్థానం



**(దుర్గం విజయ్ బాబు- ప్రశ్న న్యూస్ బ్యూరో)** తెలంగాణలో అత్యంత అరుదైన వీరగల్లును గ్రామస్తుల సహకారంతో



పరిశోధనాత్మక జర్నలిస్ట్ అల్లే రమేష్ తో కలిసి జర్నలిస్ట్ విజయ్ బాబు గుర్తించడం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని పెద్ద వాగు శివారు పరిసరాల్లో ఆరు వీరగల్లులున్నాయి. ఒక్కో వీరగల్లుకు ఒక్కో ప్రత్యేకత ఉంది.

### ఆ ఏడుగురు వీరులే ఈ వీరగల్లులు

ఊరి నిండా కాసుల రాసులు. పల్లె చుట్టూ పాడిపంటలు, పశువులు. వీర్నపల్లి గత వైభవం! కుండల కొద్దీ కాసులు కలిగి ఉన్నప్పటికీ ఆ గ్రామస్తులు కంటి నిండా నిద్రపోయేవారు కాదు!

### ప్రతి ఇంటా కాసుల గలగల..

ఈ ప్రాంతంలో వివిధ రకాల పంటలు పండేవని పెద్దలు చెబుతుంటారు. ఎక్కువగా ఉద్యాన పంటలు సాగుచేసేవారని ప్రతీతి. కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల తోటల సాగు ద్వారా సమకూరిన కాసులు (నాణేలు) ప్రతి ఇంట్లో కుండల నిండా ఉండేవి. ఇలా ప్రతి ఇంటా కాసుల గలగలలు వినిపించేవి. ఆ పశువులు, కాసులే కంటి నిండా కొనుక్కు లేకుండా చేసేవి.

### కాసులపై దోపిడీ దొంగల కన్ను

గ్రామంలో ప్రతి ఒక్కరి ఇంటిలో ఉన్న కాసులను కొల్లగొట్టడానికి



దోపిడీ దొంగలు తరుచూ ఈ గ్రామానికి దొంగతనానికి వచ్చేవారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి నాణేలను



ఎత్తుకెళ్లేవారు. దోపిడీ దొంగల నుండి మానప్రాణాలతో పాటు పశువులను ఆస్తులను కాపాడాలని రాజుకు మొరపెట్టుకున్నారు ఆ ప్రజలు. దోపిడీ దొంగల భారీ నుంచి ప్రజలను కాపాడడానికి, వారు చెమటోడ్చి సంపాదించుకున్న సొమ్మును దోపిడీ దొంగల పాలు కాకుండా ఉండడానికి అప్పటి పాలకుడు రాజు ప్రణాళిక రచించారు.

### దోపిడీ దొంగల కోసం ఏడుగురు వీరుల నియామకం

దోపిడీ దొంగలను పట్టుకోవడానికి మహిళా వేషాలు ధరించి, నగలు పెట్టుకొని దొంగల కోసం వెతకడం మొదలుపెట్టారు ఆ ఏడుగురు వీరులు. అలా వెతుకుతున్న క్రమంలో ఆ దట్టమైన అడవిలో ఆ దోపిడీ దొంగల ముఠా తెరసపడింది. వందల సంఖ్యలో ఉన్న దొంగల ముఠాతో తలపడ్డారు ఆ ఏడుగురు వీరులు. బాణాలు, బరిసెలు, కత్తులతో వీరుచితంగా పోరాడారు ఆ వీరులు. ఎక్కువ సంఖ్యలో దోపిడి దొంగల ముఠా ఉండడంతో పోరాడుతూ, ఓ వీరుడు నెత్తుటి బండ పరిసర ప్రాంతాల్లో అదృశ్యమయ్యాడు. మిగతా ఆరుగురు వీరులు పోరాడి శత్రువులను మట్టుపెట్టి, పెద్దవాగు పరిసర ప్రాంతాల్లో వీర మరణం పొందారు. వారి గుర్తుగా ఏర్పాటుచేసినవే ఆ వీరగల్లులు.

### వీర గల్లులు అంటే ఎవరు..

ఇవి రాతిపై చెక్కిన స్మారక శిలా రూపాలు. వీరుల త్యాగానికీ చిరస్మరణీయతకూ గుర్తుగా వీటిని నిర్మిస్తారు. యుద్ధంలో మరణించిన వీరులను గుర్తుచేసే స్మారకశిలలే వీరగల్లులు. మధ్యయుగ చారిత్రక వివరాలను తెలుసుకునేందుకు అపురూపమైన ఆధారాలు ఇవి. దండయాత్రలలో మరణించినవారి కన్నా గ్రామరక్షణకొరకు, ఆవులమందలను కాపాడడానికి, పులుల వంటి కరమైన జంతువులతో పోరాడి, ప్రాణాలు పోగొట్టుకున్న వీరులజ్ఞాపకంగా వేసిన శిలలే వీరగల్లులు. తర్వాత కాలాల్లో వీరశైవం వ్యాపిస్తున్నకాలంలో వీరశైవులు శివసాయుజ్యం కోరి ఆత్మాహుతి చేసుకున్నపుడు వేసిన శిలలు కూడా వీటిలో చేరి ఉన్నాయి.



### ఆచారాలు పద్దతులు..

వీరభద్ర, భైరవ తదితరరూపాల్లోని వీరులు మరణించిన తర్వాత కూడా తమ గ్రామాలను రక్షిస్తారనే నమ్మకంతో ప్రజలు ఈ వీరగల్లు విగ్రహాలకు నిత్యపూజలు అందజేస్తుంటారు.

### వేర్వేరు భాష, సంస్కృతులలో..

తెలుగులో వీరగల్లులు అని పిలువబడే ఈ శిలావిగ్రహాలు కన్నడంలో వీర్గల్, తమిళంలో నటుకల్ ఆంగ్లంలో హీరో స్టోన్స్ అంటారు. జపాన్ దేశంలోని సమురాయ్ సంస్కృతిలో కనిపించే సెప్పుక్కు, హరాకిరీ సంస్కృతులను ఈ వీరగల్లులు తలపిస్తాయి.ప్రాచీన కాలంలో యుద్ధ సమయంలో ఓడిన శత్రువుల తలలను బంతులుగా ఉపయోగించి ఆటాడుకునే 'శిర: కందుక క్రీడా వినోదం', తమ చేతుల్లో మరణించిన శత్రువీరుల రక్తమాంసాలతో ఉడికించిన అన్నాన్ని కావలి దేవతలకు ఊరిచుట్టూ పొలిజల్లటం అనే 'రణం కుడుపు' అనే సంస్కృతులు కూడా వీరగల్లులలో ప్రతిబింబిస్తాయి.

### త్యాగం చేసిన వారు..

చెరువు కట్టలు తెగిపోతున్నప్పుడు తమ ప్రాణాలనే పణంగా పెట్టి ఆ గండిలో స్వయంగా పూడ్చుకుపోయిన వారు. బలిదానం కావించబడిన వారి జ్ఞాపకార్థం కూడా కొన్ని వీరగల్లు విగ్రహాలు కనిపిస్తాయి. గ్రామరక్షణ కొరకు, ఆవులమందలను కాపాడడానికి, పులుల వంటి క్రూరమైన జంతువులతో పోరాడి, ప్రాణాలు పోగొట్టుకున్న వీరులజ్ఞాపకంగా కూడా ఈ వీరగల్లు విగ్రహాలు కనిపిస్తాయి. గండ కత్తెర వేసుకుని మరణించిన వారు, కొండ చరియలపై నుంచి దూకిన వారు. అగ్ని గుండాలలో ఆత్మాహుతి కావించుకున్నవారి విగ్రహాలను కూడా గమనించగలం

### వీరశైవంలో భాగంగా..

వీరశైవం వ్యాపిస్తున్నకాలంలో వీరశైవులు శివసాయుజ్యం కోరి ఆత్మాహుతి చేసుకున్నపుడు వేసిన శిలలు కూడా వీటిలో చేరి ఉన్నాయి. తలపై ఉన్న ముడిని ఒక చేతితో పట్టుకుని మరోచేతిలోని చురకత్తితో తమ మెడలను తెగకోసుకుంటున్న విగ్రహాలు ఇటువంటి వర్గంలో కనిపిస్తాయి.

### మాకు చాలా గర్వంగా ఉంది: వీర్నపల్లి గ్రామస్తులు

మా ఊరు పేరులో వీరత్వం ఉండడం గర్వంగా, చాలా సంతోషంగా ఉంది. ప్రజలు కష్టపడి సంపాదించిన సొమ్మును దొంగలు ఎత్తుకెళ్లకుండా, ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం ప్రాణాలను సైతం ప్రాణంగా పెట్టి పోరాడిన అలనాటి వీరులను స్మరించుకుంటామని, భావితరాలకు చరిత్ర తెలిసేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇంత గొప్ప చరిత్ర ఉన్న ఊరిలో జన్మించడం, అదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తులు అన్నారు.

# పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దు.

**డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.**

**మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమ సురేష్ రెడ్డి.**





మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో పారిశుద్ధ్యం కి సంబంధించిన పలు సమస్యలు తమ దృష్టికి రావడంతో వార్డులు తిరుగుతూ తమ సిబ్బందితో పారిశుద్ధ్యనికి సంబంధించిన సమస్యలను దగ్గరుండి పరిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమా సురేష్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఇంట్లోని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా వార్డులలో తిరిగే చెత్త బండ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. 9వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సైతం స్థానిక కౌన్సిలర్ తో కలిసి పర్యవేక్షించారు. డ్రైనేజ్ నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో నీటి సరఫరాకు సంబంధించిన పైప్ లైన్లు చెడిపోవడంతో వాటిని వెంటనే పునరుద్ధరించి నీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూడాలనీ రానున్న రోజుల్లో వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణా పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంతు తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తాటి ఈత చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మాచేడి రవితేజ గౌడ్**

**మంథని (ప్రశ్న న్యూస్)** మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజు పల్లి గ్రామంలో దాదాపుగా 20 ఈత చెట్లను 10 తాటి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేసినారు. గీత వృత్తిపై ఆధారపడి జీవనం గడిపే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి చేతికి అంది వచ్చిన చెట్లను నరికి వేయడంతో గౌడ కులస్తుల జీవనాధారం దెబ్బతిన్నది వాటి మీద బతికే గౌడ్స్ కుటుంబాలు గురించి ఆలోచన చేయాలని





ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారిని గుర్తించాలని రియల్ ఎస్టేట్ భూముల వ్యవహారంలో తాటి ఈత వనములను ధ్వంసం చేయడం ద్వారా గీ త వృత్తి కనుమరుగయే ప్రమాదం పొంచి ఉంది. వీటి మీద ఆధారపడి జీవనం గడిపే కుటుంబాలు వీధిన పడే అవకాశాలు ఉన్నాయి కావున ఇలాంటి చర్యలు మును ముందు జరగకుండా తాటి ఈత వనమును ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మాచేడి రవితేజ గౌడ్ ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేసినారు ఈ కార్యక్రమంలో మాచేటి మోహన్ గౌడ్ పొన్న మోహన్ గౌడ్ వీర శంకర్ గౌడ్ పొన్నం చంద్రయ్య గౌడ్ భీముని గోపాల్ గౌడ్ శంకర్ గౌడ్ మల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# పల్లెల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యం

## - ఎంపీపీ పెన్నింటి మధుసూదన్ రెడ్డి



**షాద్ నగర్ (ప్రశ్న న్యూస్)** కొత్తూరు మండల పరిధిలోని వైయం తండాలో మండల ప్రజా పరిషత్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ పెన్నింటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ నిధుల 4 లక్షల రూపాయలతో తండాలోని సిసి రోడ్లు వేయించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. పల్లెల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమవుతుందని, అభివృద్ధి కొరకై



ఎల్లవేళలా పాటుపడతామని, సాధ్యమైనంత వరకు నిధుల మంజూరు చేసి పల్లెల అభివృద్ధికి తోడ్పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు

# మహామహులంతా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే

- సకల సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో లభ్యం
- తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియాలలో బోధన
- మధ్యాహ్న భోజనం, ఆహ్లాదకరమైన వాతావరణం
- ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకువద్దాం: ఎల్లారం శేఖర్ రెడ్డి




**షాద్ నగర్(ప్రశ్న న్యూస్)** కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామపంచాయతీ లో గల ప్రభుత్వ పాఠశాల లో అడ్మిషన్లు పెంచేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుపాల్, రజితమ్మ వినూత్న ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఫ్లెక్సీ బ్యానర్ ద్వారా ప్రజలకు వివరించేందుకు ప్రయత్నం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు కలవని మధ్యాహ్న భోజనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, ఒత్తిడి లేని విద్య ఏర్పాటు చేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభించామని గ్రామస్తులు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఎల్లారం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహానుభావులందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నవారే అని ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేయాలని తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, గణేష్, ఉపాధ్యాయ బృందం ఆత్మల్ పాషా, సరిత, వెంకటేష్, స్వామి, ఉష, స్వాతి మరియు విద్యార్థులకు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో ఆకట్టుకున్న భరతనాట్య నృత్య ప్రదర్శన



**శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్)** మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఈరోజు శ్రీదేవి రాజనాల గారి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది.భామ ప్రవేశం, రుక్మిణి ప్రవేశం, కొలువైతివరంగశాయి, గణేశా పంచరత్న, అతినిరుపమా, బృందావన నిలయేహ్,నమశ్శివాయతేయ్, ఒకపరికొకపరి, కృష్ణం కలయసఖి,సంగీత సామ్రాజ్య,ఇదిగో భద్రాద్రి మొదలైన అంశాలను నృత్యాలయాల కళాకారులూ ప్రదర్శించి చూపరులను ఎంతగానో మెప్పించారు.

# బైక్ దొంగతనాలు, సెల్ ఫోన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న రెండు ముఠాల అరెస్ట్

## 22 సెల్ ఫోన్లు, నాలుగు బైకులు స్వాధీనం





**తార్నాక (ప్రశ్న న్యూస్)** జల్సాలకు అలవాటుపడి ఈజీగా డబ్బులు సంపాదించుకునేందుకు సెల్ ఫోన్ స్నాచింగ్ , బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న రెండు ముఠా లకు చెందిన ఏడుగురు సభ్యులను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి కొట్టేసిన సెల్ ఫోన్ లను తక్కువ ధరలకు కొంటున్న నలుగురు సెల్ ఫోన్ షాపు నిర్వాహకులను సైతం ఓయూ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 22 సెల్ ఫోన్లు, దొంగిలించిన నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈస్ట్ జోన్ డిసిపి రావుల గిరిధర్, ఓయూ డివిజన్ ఏసిపి జగన్ తో కలిసి శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు డిసిపి గిరిధర్ వివరాలు వెల్లడించారు. ఛత్రినాక గౌలిపురాకు చెందిన కంసాల అరుణ్ కుమార్ , అలియాస్ నాని (23) పాత నేరస్థుడు. సెల్ ఫోన్స్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్ళాడు. ఇతనిపై మొగల్ పురా, ఫలక్ నుమా,అబిడ్స్, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఆరు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం సరూర్ నగర్ నివాసం ఉంటున్న అరుణ్ కుమార్ అదే ప్రాంతానికి చెందిన తుస్మద్ స్నేహా అలియాస్ నిక్కు (20) ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈజీ మనీ కోసం తనతో పాటు తన భార్యను కూడా ఈ దోపిడిలోకి దింపాడు అరుణ్ కుమార్. చాధర్ ఘాట్ కు చెందిన పనగంటి రఘుబాబు (20), మరో మైనర్ తో కలిసి ఒక ముటగా ఏర్పడ్డారు. అలాగే మరో గ్యాంగ్ మల్కాజ్గిరి వసంతపురి కాలనీకి చెందిన డెకొరేషన్ పనులు చేసే బూస శాంసన్ అలియాస్ టీంకు (19), లాలాగూడ శాంతినగర్ కు చెందిన డెకరేషన్ పనులు చేసే మధు (19), మల్కాజ్గిరి వసంతపురి కాలనీ చెందిన ప్రైవేట్ ఎంప్లాయ్ కాణిపాక ప్రశాంత్ అలియాస్ చింటూ(21) మరో ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్నారు. ఇందు కోసం వారు దొంగలించిన బైక్లపై రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతూ ఫుడ్ ఫాథ్ ల మీద నిద్రిస్తున్న వారు, ఒంటరిగా వెళుతున్న వారిని టార్గెట్ చేసి మొదట రెక్కి నిర్వహించి తర్వాత సెల్ ఫోన్లు దొంగలించి ఉడాయిస్తున్నారు. ఈ రెండు ముఠాల సభ్యులు తాము దొంగిలించిన సెల్ ఫోన్లను సికింద్రాబాద్ సిక్ విలేజ్ కు చెందిన సెల్ ఫోన్ మెకానిక్ మహమ్మద్ ఉరఫ్ చిచ్చా (65), తుకారం గేట్ కు చెందిన ఆటో డ్రైవర్ ఇలియాస్ అఫ్రోజ్(44), లాలాగూడ కు చెందిన సెల్ ఫోన్ మెకానిక్ షేక్ అలీ (39), ఉప్పుగూడ కు చెందిన వి .రాజు(23)లకు రూ.2వేల నుంచి రూ.3వేలకు విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించగా వచ్చిన డబ్బులను అందరు సమానంగా పంచుకొని తమ జల్సాలకు తీర్చుకుంటున్నారు. శుక్రవారం రాత్రి 2 గంటల సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తార్నాక బస్టాప్ లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి పక్కనే ఓ మైనర్ బాలుడితోపాటు మరో యువకుడు నిలబడి ఉండటాన్ని గమనించిన పోలీసులు వారి వద్దకు వెళ్లే లోపే వారు పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 3న తార్నాక బస్టాప్ లో నిద్రిస్తున్న వ్యక్తి సెల్ ఫోన్ కూడా ఇదే రీతిలో లాక్కొని పరార్ అవుతుండగా పెట్రోలింగ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా సెల్ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వారు అంగీకరించారు. అలాగే గతంలో కూడా ఎక్కడెక్కడ సెల్ఫోన్లు దొంగిలించారు ఆ వివరాలు కూడా వారు పోలీసులకు వెల్లడించారు. సెల్ ఫోన్లు కాకుండా పార్కింగ్ చేసిన బైకులను తొంగిలించి వాటిని డిస్మెంటల్ చేసి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. అలాగే తాము దొంగిలించిన బైకులతోనే సెల్ ఫోన్స్ వాచింగ్ లకు పాల్పడుతున్నట్టు పోలీసులకు వెల్లడించారు. రెండు గ్యాంగుల నుంచి 22 సెల్ ఫోన్లు, సెల్ఫోన్ స్నాచింగ్లకు ఉపయోగిస్తున్న నాలుగు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ దొంగతనం పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులతో పాటు, వాటిని కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించడం, లేదా పార్టు పార్టుగా విడదీసి అమ్ముతున్న నలుగురు రిసీవర్లను కూడా అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్కు తరలించారు.

## అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ జాగిలం రాజా పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించిన ఎస్పీ అఖిల్ మహాజన్



**సిరిసిల్ల( ప్రశ్న న్యూస్)** జిల్లా హెడ్ క్వార్టర్ లో పోలీస్ జాగిలం (లాబ్రడార్ రిట్రీవర్) సంతతికి చెందిన రాజా , వయస్సు 15 సంవత్సరాలు అనారోగ్యంతో మరణించినది. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ అధికారులు, పోలీస్ జాగిలం హ్యాండ్లర్ మల్లేశం తో కలసి రాజా పై పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించి రాజా సేవలు మరువలేనివని సంతాపాన్ని వ్యక్తం చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజా గత 14 సంవత్సరాల నుండి జిల్లాలో విఐపి. వివిఐపిలు సందర్శించినప్పుడు (ఆర్ఓపి) స్నిపర్, బాంబులు, మందు పాత్రలు, గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించి విధులు నిర్వహించేదని కొనియాడారు. 2010 సంవత్సరంలో రాజా తన హ్యాండ్లర్ మల్లేశం తో పాటుగా ఎనిమిది నెలల పాటు ఐ ఐ టి ఏ నందు బేసిక్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించగా జిల్లాలో గత 14 సంవత్సరాలుగా సేవలందించిందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు యాదగిరి, మాధుకర్, రమేష్, రాజా హ్యాండ్లర్ మల్లేశం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూప్ 1 పరీక్షలు.. ఎస్పీ ఆంక్షలు



**జగిత్యాల జిల్లా బ్యూరో (ప్రశ్న న్యూస్)** గ్రూప్-%×% రాత పరీక్షకు సంబంధించి జగిత్యాల జిల్లాలో మొత్తం 22 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, వాటి వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. అలాగే పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు మూసి వేయాలని, పరీక్ష సెంటర్స్ వద్ద నుంచి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని ఎస్పీ ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద 300 మ%శీ%ది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్షా సమయం కంటే 1 గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఎస్పీ సూచించారు. అభ్యర్థులు చివరి నిమిషంలో వచ్చి ఇబ్బంది పడకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, స్మార్ట్ ఫోన్లు, వాచ్ లు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.

# రామోజీరావు ధ్రువతారగా ఎల్లకాలం వెలుగుతూ ఉంటారు

## - గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్

- తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తి రామోజీరావు
- ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటు
- రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నా
- గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్
- రామోజీ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి
- గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు ధ్రువతారగా ఎల్లకాలం వెలుగుతూ ఉంటారని గూడూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు అస్తమయంపై గూడూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటు అని ఆయన అన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన రామోజీరావు కీర్తి అజరామరం అన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారని.. మీడియా రంగంలో ఆయనది ప్రత్యేకమైన శకం అని కొనియాడారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని అన్నారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావు కి దక్కుతుందన్నారు.తెలుగువారి కీర్తిని దేశ స్థాయిలో చాటిన వ్యక్తి రామోజీరావు అన్నారు.పత్రిక నిర్వహణ ఒక సవాల్ అనుకునే పరిస్థితుల్లో ఐదు దశాబ్దాల పాటు ఈనాడు పత్రికను నెంబర్ వన్ స్థానంలో నడపడం, ఈటీవీ స్థాపనతో టీవీ మీడియా రంగానికి దశాదిశా చూపిన దార్శనికుడు రామోజీరావు అని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. రామోజీరావు లేని లోటు తెలుగు మీడియా రంగానికి, వ్యాపార రంగానికి తీరని లోటని అన్నారు.నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేస్తూ.. ఎందరోమంది జీవితాల్లో వెలుగులు నింపిన రామోజీరావు అస్తమయం.. తెలుగు మీడియా రంగానికి, టీవీ పరిశ్రమకు, తీరని లోటు అని అన్నారు. రామోజీ రావు ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ తెలియజేశారు.

# అక్షరయోధుడు అస్తమయం

- రామోజీరావు జీవితం అందరికీ ఆదర్శనీయం
- మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు
- తెలుగు పత్రిక రంగంలో మకుటం లేని మహారాజు
- మీడియా సామ్రాజ్యాధినేత రామోజీరావు లేని లోటు పూడ్చలేనిది
- ఓజిలి తెలుగుదేశం మండల పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళి





**ఓజిలి (ప్రశ్న న్యూస్)** తెలుగు వెలుగు, తెలుగు జాతి ఆణిముత్యం, ఈనాడు గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు, పూజ్యులు చెరుకూరి రామోజీరావు పరమపదించడం బాధాకరమని టిడిపి మండల కమిటీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెలుగు జర్నలిజాన్ని ఓ మలుపు తిప్పిన ఘనత రామోజీరావుకి దక్కుతుందన్నారు. తెలుగు పత్రికా రంగంలో బహుటు లేని మహారాజు అని అన్నారు.

మీడియా సామ్రాజ్యాధినేత రామోజీరావు లేని లోటు పూడ్చలేనిది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో మరపురాని సినిమాలు నిర్మించి, రామోజీ ఫిలింసిటీ నిర్మించి సినిమా ఇండస్ట్రీకి ఎంతో సేవ చేశారు. జర్నలిజం, సాహిత్యం, విద్యలో ఆయన అందించిన సేవలకు గాను పద్మభూషన్, పద్మ విభూషణ్ అందుకున్నారు. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, మండల టిడిపి నాయకత్వంలో ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఓజిలి బస్టాండ్ లో టీడీపీ మండల నాయకులు పద్మ విభూషణ్ స్వర్గీయ శ్రీ చెరుకూరి రామోజీరావుకి శనివారం సంతాపం తెలియజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ కుమార్ నాయుడు, ఓజిలి టిడిపి యువ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు బిసి సెల్ నాయకులు పాడి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, టీడీపీ నేతలు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, సుబ్రమణ్యం రాజు, కార్తీక్ రాజు, అల్లాబక్షు, రఫీ, అట్ల మల్లికార్జున్, మస్తాన్ రెడ్డి, సుబ్బారావు, నారాయణరెడ్డి మోహన్ రాజు, కాటూరి వెంకటేశ్వర్లు, అనుబోలు రవీంద్రరెడ్డి, సివిఆర్, సుష్మంత్, జయచంద్ర రెడ్డి, కోటీ, సుధాకర్ రెడ్డి తదితర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## గూడూరు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన పాత్రికేయులు



**నెల్లూరు బ్యూరో ( ప్రశ్న న్యూస్)** గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ను ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నికవడం పట్ల శాలువా కప్పి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ జమాలుల్లా, ప్రధాన కార్యదర్శి శరత్ యాదవ్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ గౌడ్, సీనియర్ పాత్రికేయులు నాని, సురేష్, లక్ష్మణ్, తులసి రాజు, శివకుమార్, యువ పాత్రికేయులు నిరంజన్, నరసింహారావు, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓజిలిలో అంబరాన్నంటిన సంబరాలు

## మంగళ వాయిద్యాలతో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్న తెదేపా శ్రేణులు





**ఓజిలి (ప్రశ్న న్యూస్)** టీడీపీ-జనసేన-బీజేపీ తిరుగులేని విజయం సాధించడంతో టీడీపీ శ్రేణుల ఓజిలి గ్రామంలో విజయోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఓజిలి గ్రామంలోని బిసి కాలనీలో ఎస్.కెబాబు, ఎస్.కె .మస్తాన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా టిడిపి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్, 30 వ వార్డు బూత్ కన్వీనర్ అట్లా మల్లికార్జున్ యాదవ్, మైలం జయ చంద్ర రెడ్డి,తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, ఫ్రాంక్లిన్, ఎస్.కె.అల్లాభక్షు ,రాజేష్ నాయుడు, ప్రభాకర్ నాయుడు , మోహన్ రాజు,సుబ్రహ్మణ్యం రాజు, ఓజిలి వెంకటయ్య, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆనంతరం బాణా సంచా కాల్చి విజయోత్సవ సంబరాలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలను పంచి పెడుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి, ఉమ్మడి అభ్యర్థిగా డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు ఆశీర్వాదమే అత్యధిక మెజార్టీతో విజయం సాధించిందని . ఈ విజయం మన కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులందరిదీ అని ఈ విజయం అంకితం. ప్రజల ఆశీర్వాదబలంతో చరిత్ర సృష్టించగలిగామని ఎమ్మెల్యేగా ఒక మహిళ డాక్టర్ విజయశ్రీ గెలవడం ఒక చరిత్రని సులూరుపేట నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని సులూరుపేట నియోజకవర్గానికి ఓజిలి మండలానికి ఓజిలి గ్రామానికి నంబర్ వన్ గా అభివృద్ధి పథంలో నడిపిస్తారని వారన్నారు. నెలవల విజయశ్రీ విజయం ప్రజా విజయమన్నారు. చంద్రబాబు నాయుడు ఆశీస్సుల తో సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టిస్తారని కొని యాడారు. గడిచిన ఐదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అరాచ కాలకు ప్రజలు చరమగీతం పాడుతూ 2024 ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పారని తెలిపా రు.అమరావతి రైతుల కన్నీటి బొట్టులు కూటమిఅభ్యర్థుల విజయానికి కారణమయ్యాయి అన్నారు.రాష్ట్ర బాగావ్యాప్తంగా కూట మి అభ్యర్థులను సునామీ లాగ బలపరిచినందుకు రాష్ట్ర ప్రజల కు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు నాయ కత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృ ద్ధి చెందుతుందన్నారు.ఐదేళ్ల వైఎస్ఆర్ పాలనలో ప్రజలువిసిగి పోయారన్నారు.టిడిపి నాయకు లను కార్యకర్తలను అనేక ఇబ్బం దులకు గురిచేసి అక్రమకేసులు బనా యించారని ఆవేదన వ్యక్తం చేశారు.మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అన్ని%శీ%టినీ చంద్రబాబు నాయుడు అమలు పరుస్తారన్నా రు.టిడిపి నాయకులకు కార్యకర్త లకు యువతకు మహిళలకు చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఖాదరవల్లి ,ముమ్మడిసుధాకర్ ,మధురెడ్డి,కాటూరు.శినయ్య ,రఫీ నాయబ్ ,వెంకటేశ్వర్లు(సోమిరెడ్డి),
యువనాయకులు కాటూరు.కోటేశ్వరరావు,ఎ.మల్లికార్జున యాదవ్ ,పాడి.శ్రీను ఎస్ కె.ఖలీల్ ,ఓజిలి.సుష్మంత్, కస్తూరి రాజా,రమేష్ ,వేముల.రాజా ,ఓజిలి.నవీన్, పి.హేమంత్ కుమార్,మస్తాన్(డాక్టర్) ,చానా ,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ నేతలు ముగ్గురే...

**గుంటూరు :** ఏపీ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ 135 స్థానాల్లో విజయం సాధించింది. జనసేన పార్టీ 21 సీట్లు గెలిచింది. వైఎస్సార్‌సీపీ 11 చోట్ల, బీజేపీ 8 చోట్ల గెలిచాయి.ఈ ఎన్నికల ఫలితాల తర్వాత అసెంబ్లీలో మైనారిటీల ప్రాతినిధ్యం తగ్గింది. టీడీపీ ఈసారి ముగ్గురు మైనారిటీలకు టికెట్ ఇవ్వగా, వైసీపీ 8 మందికి టికెట్లు ఇచ్చింది. బీజేపీ, జనసేన ఒక్క మైనారిటీకి కూడా టికెట్ కేటాయించలేదు. వైసీపీ టికెట్లు ఇచ్చిన మైనారిటీల్లో ఒక్కరు కూడా గెలవలేదు. ఇక టీడీపీ టికెట్లు ఇచ్చిన ముగ్గురు గెలిచారు. దీంతో ఈసారి అసెంబ్లీలో మైనారిటీలకు ప్రాతినిధ్యం వహించేది ఈ ముగ్గురే.గుంటూరు ఈస్ట్ నుంచి మహ్మద్ నసీర్ అమ్మద్ విజయం సాధించాడు. ఇక నంద్యాల నుంచి మహ్మద్ ఫరూక్, మదన పల్లి నుంచి షాజహాన్ బాషా విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో 9.5 శాత మంది మైరారిటీలు ఉన్నారు. వీరంతా ఓబీసీలుగా పరిగణించబడుతున్నారు. తాము మూడోసారి అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ ప్రకటించింది. బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చింది. ఇక ఏపీలో బీజేపీ?టీడీపీ?జనసేన కూటమిగా పోటీ చేశాయి. ఈ సమయంలో మైనారిటీల ప్రాతినిధ్యం తగ్గడం గమనార్హం.ఇదిలా ఉండగా, ఏపీలో కొత్తగా ఏర్పడే ఎన్‌డీఏ ప్రభుత్వంలో టీడీపీ ఎక్కువ మంత్రి పదవులు తీసుకోవడం ఖాయం. తర్వాత జన సేనకు, తర్వాత బీజేపీకి పదవులు వరిస్తాయి. మైనారిటీ కోటాలో మంత్రి పదవులు ఇవ్వాల్సి వస్తే టీడీపీ తరఫున గెలిచిన ముగ్గురు మహ్మద్ నసీర్ అమ్మద్, మహ్మద్ ఫరూక్, షాజహాన్ బాషా లలో ఒకరికి దక్కుతుంది. ఆ ఒక్కరు ఎవరు అనేది ఇప్పుడు ఏపీ మైనారిటీల్లో చర్చనీయాంశంగా మారింది.

# షర్మిళపై కాంగ్రెస్‌లో తిరుగుబాటు

**కడప :** ఏపీలో షర్మిల అనుకున్నది సాధించగలిగారా? కాంగ్రెస్ పార్టీని మెరుగైన స్థితికి తీసుకెళ్లగలిగారా? అంటే మొదటి దానికి సంతృప్తికరమైన సమాధానం వస్తోంది.రెండో దాని విషయంలో మాత్రం లేదనే జవాబు వస్తోంది. అన్నతో విభేదించి తెలంగాణలో పార్టీ పెట్టారు షర్మిల. అక్కడ అనుకున్న స్థాయిలో రాణించలేకపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణలోని రాజకీయం చేయాలని భావించారు. కానీ కాంగ్రెస్ హై కమాండ్ అందుకు అనుమతించలేదు. ఏపీ పగ్గాలు అప్పగించింది. అయితే అక్కడ కాంగ్రెస్ అధ్యక్ష స్థానం దక్కించుకున్న షర్మిల.. పార్టీ బలోపేతం కంటే అన్న జగన్ పతనాన్ని ఎక్కువగా కోరుకున్నారు. అందులో మాత్రం సక్సెస్ అయ్యారు. ఆమె పోరాట ఫలితమే కడప జిల్లాలోవైసిపి పతనం.కానీ ఆమె పోరాటం కాంగ్రెస్ పార్టీకి విజయం చేకూర్చలేదు.కడప జిల్లా ప్రజలు మనసు మార్చేందుకు షర్మిల చేయని ప్రయత్నం అంటూ లేదు.కడప ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆమె జిల్లా ప్రజలకు ఎన్నో రకాలుగా వినతులు ఇచ్చారు.ఆ మహానేత బిడ్డగా కొంగుచాచి అడుగుతున్నాను ఓటు వేయండి అని కోరారు.ఆమె తరుపున వివేక భార్య, కుమార్తె సైతం ప్రచారం చేశారు. వివేకానంద రెడ్డి ని హత్య చేసిన వారికి అండగా నిలబడతారో? బాధితులకు అండగా నిలబడతారో? తేల్చుకోవాలని జిల్లా ప్రజలను కోరారు.అయితే ప్రజలు మాత్రంఆమె మాటను విశ్వసించారు కానీ.ఆమెను ఆదరించలేదు. కూటమి వైపు మొగ్గు చూపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రభావాన్ని చూపారు. 10 సీట్లకు గాను ఏడు చోట్ల కూటమి అభ్యర్థులను గెలిపించారు. కానీ పార్లమెంట్ స్థానానికి వచ్చేసరికి త్రిముఖ పోటీలో అవినాష్ రెడ్డి ని గెలిపించారు. వైసిపి అసెంబ్లీ అభ్యర్థులు గెలవడం ద్వారా షర్మిల లక్ష్యం నెరవేరినా.. ఎంపీగా అవినాష్ రెడ్డి గెలుపు మాత్రం షర్మిలకు రుచించని విషయం.అయితే ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. కేవలం జగన్ ను దెబ్బతీయాలని షర్మిల చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆ విషయంలో మాత్రం ఆమె సక్సెస్ అయ్యారు. కానీ కాంగ్రెస్ పార్టీని లైమ్ లైట్లో తీసుకురావడంలో మాత్రం ఫైలయ్యారు. నిన్నటి వరకు ఆమె కాంగ్రెస్ పార్టీకి ఆశాదీపం అవుతారని భావించిన వారు నీరుగారిపోయారు. పార్టీలో సైతం ఒక రకమైన అసంతృప్తి కనిపిస్తోంది. ఎన్నికల్లో టికెట్లు అమ్ముకున్నారన్న ఆరోపణ ఇప్పుడు బయటకు వచ్చింది. విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలనుకున్న సుంకర పద్మశ్రీ తాజాగా మీడియా ముందుకు వచ్చారు. షర్మిలపై ఆరోపణలు చేశారు. ఆమెతో కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి లాభం లేదని.. టిక్కెట్లు సైతం అమ్ముకున్నారని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో సైతం షర్మిలపై తిరుగుబాటు ప్రారంభం అయినట్టు కనిపిస్తోంది.

# వైసీపీకి రావెల రాజీనామా

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండు రోజుల్లోనే మాజీ మంత్రి రావెల కిషోర్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితిలో ఉన్న ఆయన ఆ తర్వాత రాజీనామా చేసి వైసీపీలో చేరారు. తన భార్యను కూడా ఆయన పార్టీలో చేర్చారు. బాపట్ల ఎంపీ టిక్కెట్ ఆయనకు లేదా ఆయన భార్యకు ఇస్తారని అనుకున్నారు. కానీ టిక్కెట్ ఇవ్వలేదు. అయినప్పటికీ ఎన్నికల్లో వైసీపీ కోసం పని చేశారు. ఎన్నికల ఫలితాలు అనుకూలంగా లేకపోవడంతో ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించిన ఆయన చంద్రబాబుపై ప్రశంసలు కురిపించారు. 2014లో తనకు టిక్కెట్ ఇచ్చి.. గెలిపించి మంత్రిని చేశారని చెప్పుకొచ్చారు. మంత్రి పదవి నుంచి మధ్యలో తప్పించడంతో పాటు తర్వాత ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. పార్టీ నేతలతో సఖ్యతగా ఉండకపోవడమే దీనికి కారణం. తర్వాత పలు పార్టీలు మారారు. దురదృష్టవశాత్తూ కొన్ని కారణాలతో టీడీపీలో కొనసాగలేకపోయినందుకు ఎప్పుడూ బాధపడుతూనే ఉంటానని తెలిపారు. మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో పనిచేసేందుకు ఎన్నోసార్లు ప్రయత్నించినా సఫలం కాలేదని వాపోయారు. వైఎస్ జగన్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాధికారం తెస్తానన్న మాటలు నమ్మి తాను వైసీపీలో చేరినట్లు తెలిపారు. కానీ, ఈ ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు ఆయనను తిరస్కరించారని పేర్కొన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు వల్లనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు అఖండ విజయం ఇచ్చారని ప్రశంసించారు. మందా క్రిష్ణ మాదిగ 40 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారు. ఇప్పుడు ఆ అంశం ముగింపునకు వచ్చిందని భావిస్తున్నానని రావెల అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు ఇద్దరూ వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. 2014 ఎన్నికల్లో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన రావెల కిశోర్‌బాబు.. చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అయితే 2019 ఎన్నికల ముందు జనసేనలో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన బీజేపీలో చేరారు. ఆ తర్వాత ఆ పార్టీకి కూడా రాజీనామా చేసిన ఆయన.. కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కొంత కాలం తర్వాత బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి.. వైసీపీలో చేరారు. ఇప్పుడు ఆ పార్టీకి కూడా రావెల కిషోర్‌బాబు. ఇప్పుడు రావెల కిషోర్ ఏ పార్టీల చేరాలన్నా రెండో సారి ఎంట్రీ ఇవ్వాల్సిందే.

# నెల్లూరులో కలిసొచ్చిన నారాయణ మంత్రం

**నెల్లూరు :** నెల్లూరు జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్.. ఆ తర్వాత వైసీపీకి కంచుకోట. అలాంటి కంచుకోట గోడలు బద్దలయ్యాయి. ఆ కోటపై ఇప్పుడు టీడీపీ జెండా ఎగిరింది. నెల్లూరు జిల్లాలోని నెల్లూరు సిటీ నియోజకవర్గం టీడీపీకి కలిసిరానిదిగా మిగిలింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత రెండంటే రెండే సార్లు అక్కడ ఆపార్టీ గెలవగలిగింది. 1983, 1994 లో అక్కడ టీడీపీ గెలిచింది. అంతకుముందు, ఆ తర్వాత కాంగ్రెస్ మాత్రమే గెలుచుకుంటూ వస్తోంది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ ఖాతాలోకి నెల్లూరు సిటీ వెళ్ళింది. 1994 తర్వాత ఒక్కసారి కూడా టీడీపీ గెలవలేక పోయింది.

ఆరు పర్యాయాలు.. అంటే ముప్పై ఏళ్లుగా ఆ నియోజకవర్గంలో ఎంత పోరాడిన గెలుపు మాత్రం దక్కలేదు.అలాంటి చోట ఈ ఎన్నికల్లో టిడిపి జెండా ఎగిరింది. అదికూడా వైసిపి సామాజిక సమీకరణ అస్త్రాన్ని ప్రయోగించినా అనూహ్య విజయం సాధించింది టీడీపీ. 70,542 ఓట్ల బంపర్ మెజారిటీతో మాజీమంత్రి పొంగూరు నారాయణ గెలిచారు. మైనారిటీ ఓట్లు అధికంగా ఉన్న ఇక్కడ వైసిపి డిప్యూటీ మేయర్ ఖలీల్?ను రంగంలోకి దించినా మైనారిటీ ఓటర్లు సైతం మెజారిటీగా నారాయణ వైపు నిలిచారు. గెలుపే దక్కని నియోజకవర్గంలో నారాయణ ఇంత మెజారిటీతో గెలవడం ఇక్కడ డబుల్ రికార్డ్. 2014లో ఎమ్మెల్సీగా, మంత్రిగా పనిచేసిన నారాయణ నెల్లూరు సిటీలో భారీగా నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

2019 ఎన్నికల్లో గెలుపు దాకా వెళ్లి తక్కువ ఓట్లతో మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేతిలో ఓటమి పాలయ్యారు. మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేశారు నారాయణ. గతంలో చేసిన అభివృద్ధి, ఓడారన్న సెంటిమెంట్, ప్రభుత్వ వ్యతిరేకత అన్ని కలిసి భారీ మెజారిటీతో గెలిచారు. ఇక తన కోసం కష్టపడ్డ క్యాడర్‌కు నారాయణ కృతజ&జతలు తెలిపారు. తనకోసం పని చేసిన క్యాడర్‌కు ఏడాదికి రూ.10 కోట్లతో వారి కుటుంబ క్షేమం, విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తానని ప్రకటించారు. జీవితకాలం తన క్యాడర్?కు ఈ సాయం అందేలా.. తన తర్వాత కూడా కుటుంబ సభ్యులు దీన్ని కొనసాగించేలా ఏర్పాట్లు చేశారు. మొత్తానికి గెలుపే దక్కని చోట గెలవడం.. భారీ మెజారిటీ దక్కడం, కార్యకర్తల సంక్షేమం ఇలా అన్నింట్లో నారాయణ రికార్డు సాధించారు.

# నిండా ముంచిన ఐ ప్యాక్

**విజయవాడ :** మొన్నటి ఎన్నికల ఫలితాల్లో జూఖీఅఖ ఘోరమైన ఫలితాన్ని చవిచూసిన విషయం అందరికీ తెలుసు. జనమే జగన్.. జగనే జనం .. ఎక్కడ చూసినా ఈ స్థాయి ఎలివేషన్లే. కానీ లాస్ట్ ఐదేళ్లలో ఆయన జనంలో ఉన్నాడా.. ? లేదు. సిద్ధం చివర్లో చేసిన యుద్ధం తప్ప.. కనీసం కాలు కింద పెట్టి నడిచింది లేదు. తాడేపల్లి దాటి వచ్చింది లేదు. సరే ఆయన లేడు.. జనంతో కలిసి ఉన్నవాళ్లు ఎవరు ఆయనతో ఉన్నారు.. ఏ ప్రజాప్రతినిధితో అయినా నేరుగా మాట్లాడారా... గ్రౌండ్‌లో సిచ్యువేషన్ తెలుసుకున్నారా.. ఇవన్నీ చేయకుండా జనాలతో కనెక్షన్ లేకుండా నా వెంట జనం ఉన్నారనే హెల్యూజినేషన్ లో ఉండిపోయారు. ఆ పరిస్థితి ఎందుకంటే..2019లో ఆ స్థాయిలో గెలుపు ఉంటుందని బహుశా అప్పటికి వైఎస్సార్పీపీ అనుకుని ఉండదు. ఈ సారి ఇంత దారుణమైన పరాభవం ఉంటుందని ఊహించి ఉండరు. అందుకే దీనిని ఆ పార్టీ నాయకులు అంత తేలిగ్గా తీసుకోలేకపోతున్నారు. ముఖ్యంగా పార్టీ అధ్యక్షుడు జగన్ మోహనరెడ్డి. 2019 ఎన్నికలకు ముందు మనకు ప్రత్యేక హోదా.. రాలేదా... మన పోలవరం కంప్లీట్ అవ్వలేదా.. అయ్యయ్యో.. అన్నట్లుగా అభినయించి మరీ ఆయనో ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇప్పుడు అదే టోన్ ఇంత దారుణమైన ఫలితాలు వచ్చాయా.. కోటి కుటుంబాలకు డబ్బులిచ్చామా అయినా ఓట్లేయలేదా అయ్యయ్యో అనుకోవాలి మరి.. మొన్న వైసీపీ అధినేత పావుగంట ప్రెస్‌మీట్ చూస్తే అలాగే అనిపించింది. ఇంత మందికి అంత చేస్తే.. ఎందుకు పోయింది అని జగన్ ..నిజంగానే ఆశ్చర్యపోయారు. ఆయన ఆశ్చర్యంలో కూడా నిజం ఉంది. ఎందుకంటే ఫలితాలు వచ్చే వరకూ తాను ఓడిపోతానని జగన్ అనుకోలేదు. ఇంత దారుణ ఓటమి కాదు మామూలుగా కూడా ఓడను.. తనకు 150 వస్తాయి అనే అనుకున్నారు. ఎందుకో చెప్తాను చూడండి. జగన్ కు ముక్కు.. చెవులు... నోరు అని ముగ్గురుంటారు... రాష్ట్రంలో పరిస్థితి ఏంటో స్మెల్ చూసి చెప్పడానికి సుబ్బారెడ్డి, ఎక్కడెక్కడ ఏం జరుగుతుందో వినడానికి విజయసాయిరెడ్డి, తాను అనుకుంది.. లీడర్లకు చేరవేయడానికి సజ్జల రామకృష్ణారెడ్డి ముక్కు, చెవులు, నోరు రోల్స్ వీళ్లవి. సరే వీళ్లలో ఎవరైనా ప్రజా నాయకులా.. ఎలక్షన్‌లో గెలిచారా.. ఎక్కడా గెలవని వీళ్లు చెబితే భారీ మెజార్టీలతో గెలిచిన ప్రజాప్రతినిధులు వినాల్సిన పరిస్థితి. ఇక వీళ్లు కాకుండా చెవిరెడ్డి, మిధున్ రెడ్డి అనే ఫీడ్‌బ్యాక్ టీమ్. వీళ్లు జగన్ కు ఏం జరుగుతుందో చెప్తారు. కానీ అంతకంటే ముందే ఆ ఫీడ్‌బ్యాక్ కు ఓ ఫిల్టర్ పడుతుంది. అది ఎవ్వరూ అన్నది ఇక్కడ చెప్పలేం కానీ ఆ ఫిల్టర్ లోనుంచి వెళ్లిన ఇన్ ఫర్మేషన్ మాత్రమే జగన్ కు చేరుతుంది. దాన్నే ఆయన నమ్మారు. ఇక రెండో వింగ్ ఐపాక్. వీళ్లను కూడా జగన్ బాగానే నమ్మారు అనుకోవాలి. 2019లో కులాల వారీగా లెక్కలతో ఎక్కడెక్కడ ఎవరూ ఇన్ ఫ్లుయెన్సల్ అని చెప్పి.. మీతో సీట్లు ఇప్పించారు . అవి వర్కవుట్ అయ్యాయి. ఇప్పుడూ అదే అంటే.. కుదరదుగా.. నాయకుడికి సొంతంగా విశ్లేషించుకునే సామర్థ్యం ఉండాలి. పరిపాలనలో అయినా .. రాజకీయంలో అయినా లాజికల్, టాక్టికల్, ప్రాక్టికల్ మూడు విధానాలుంటాయి. మీ మీద, మీ ప్రభుత్వం మీద ఉన్న ప్రజా వ్యతిరేకతను.. తగ్గించడానికి అభ్యర్థులను మార్చండి అని ఎజూజీఞ చెబితే 90 మందిని మార్చేశారు. వ్యతిరేకత మీ మీద ఉంటే.. ఎమ్మెల్యేలను మారిస్తే.. వ్యతిరేకత ఎలా పోతుంది...? ఇంత చిన్న లాజిక్ ఎందుకు మిస్ అయ్యారు మీరు...? ఓ పక్క మిమ్మల్ని చూసి ఓటేయండి అన్నారు. ఇంకో పక్క ఎమ్మెల్యేలను మార్చేశారు. అర్థం ఉందా ఇందులో...? టాక్టికల్ గా కులాల ప్రకారం సీట్లు ఇస్తే.. గెలిచేస్తామనే మీ లెక్క కూడా తప్పు. ఆ కులాలకు మీ దగ్గర సరైన ప్రాధాన్యం ఉంటే ఓట్లేస్తారు. అంతే కానీ బొమ్మలుగా నిలబెడితే కాదు కదా.. మీ పార్టీలో వేరే కులం నాయకులకు ఎక్కడైనా ప్రాధాన్యం ఉందా.. పార్లమెంటరీ పార్టీ, లోక్ సభ ఫ్లోర్ లీడర్, పార్టీలో టాప్ లీడర్లు అంతా ఎవ్వరు.. మరి పెత్తనం లేకుండా పదవి ఇస్తే ఓట్లు వేసేంత అమాయకులా జనం...చివరది ప్రాక్టికాలిటీ. కోటి కుటుంబాలకు పథకాలు ఇచ్చాను కాబట్టి ఇంటి మూడు ఓట్లు చొప్పన 3 కోట్ల ఓట్లు నాకే వేస్తారు అనుకోవడం అమాయకత్వం కదా.. జగన్ రెడ్డి గారూ..!? అలా అనుకోవడమే కాదు.. పైగా ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెబుతున్నారు. ఇలా చేశారు ఏంటి అని.. కోటి కుటుంబాల లెక్క చెప్తా చూడండి. కోటి కుటుంబాల్లో మీ పార్టీవి సగం.. అవతలి వాళ్లవి సగం ఉంటాయి. లేదా మీవి 60 లక్షలు ఉంటే వాళ్లవి 40 లక్షలు ఉన్నాయి. మీరు ఏం చేసినా ఈ 40 లక్షలను మీ వైపు తీసుకురాలేరు. ఇప్పుడు తెలుగు దేశం ప్రభుత్వం కూడా ఎన్ని పథకాలు ఇచ్చినా మీకు ఓట్లు వేసే కుటుంబాలను వాళ్ల వైపు తీసుకెళ్లలేరు. ఓడిపోయినా కూడా మీకు 40శాతం ఓట్లు వచ్చినట్లే.. తెలుగుదేశానికి కూడా 2019లో 40శాతం వచ్చాయి. అవి అంత తేలిగ్గా మారవ్. ముఖ్యంగా తెలుగుదేశం ఓట్లు అస్సలు మారవు. ఇంకా చెప్పాలంటే ఓ పార్టీగా.. తెలుగుదేశం వైఎస్సార్పీపీ కన్నా పెద్దది. ఈ దేశంలో అత్యధిక మంది కార్యకర్తల బలం ఉన్న ప్రాంతీయ పార్టీ అది. ప్రతి ఊరిలో పార్టీలు, వర్గాలుగా విడిపోయిన చోట మనం ఇన్ ఫ్లూయెన్స్ చేయలేరు. చిన్న గ్రామాల్లో అయితే వందల్లో, చిన్న పట్టణాల్లో వేలల్లో డిఫరెన్స్ ఉంటుంది అంతే. ఈ విషయం తెలియడమే ప్రాక్టికాలిటీ. దీనిని మీ పక్కనున్న వాళ్లు చెప్పలేదా.. కోటి మందికి ఇచ్చాం కాబట్టి కనీసం 70శాతం ఓట్లు వేస్తారనే హెల్యూజినేషన్ లోనే మిమ్మల్ని ఉంచారా... లేక మీరే ఉన్నారా... ఎప్పుడైనా అధికారాన్ని డిసైడ్ చేసేది.. పార్టీ ఓటర్లు కాదు. మీరు చెప్పిన కోటి కుటుంబాలే కాకుండా ఇంకో 20లక్షల కుటుంబాలు కూడా ఉన్నాయి. ఏ పార్టీకి చెందని.. రాష్ట్రంలో ఏం జరిగిందో చూసి.. ఓట్లు వేద్దామనుకునే వాళ్లు ఉంటారు. వాళ్లు మాత్రమే డిసైడ్ చేస్తారు. 2019లో మీకైనా.. 2024లో కూటమికైనా ఓట్లేసింది వాళ్లే... ఇవే కాదు.. అసలు మీరు సరిగ్గా తెలుసుకుంటే చాలా విషయాలు తెలిసేవి.. కార్యకర్తలకు టైమ్ ఇవ్వడం లేదని,.. కనీసం నాయకులకు అపాయింట్మెంట్లు లేవనే ఆవేదన మీ చెవులకు వినిపించలేదా. రాష్ట్రంలో ఏకపక్షంగా జరుగుతున్న వ్యవహారాలపై, పోలీసులు బిహేవ్ చేసిన తీరుపై జనాలు మాట్లాడుకుంటూనే ఉన్నారు. నర్సీపట్నం డాక్టర్ సుధాకర్ కు ఏ గతి పట్టిందన్న దానిపై.. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేస్తే.. పార్టీ అతన్ని ఎలా ట్రీట్ చేసిందన్న దానిపై, దళిత యువకుడికి పోలీసులే గుండు కొట్టడంపై.. చంద్రబాబు ర్యాలీలపై రాళ్లు వేయడంపై,.. పవన్ కల్యాన్ పై నోటికొచ్చినట్లు పేట్రేగిపోవడంపై.. ప్రజా ప్రతినిధులను కొట్టడంపై... ఈ అప్పులు రాష్ట్రాన్నే కొంప ముంచుతాయేమో అన్న భయాలపై, ప్రభుత్వ ఉద్యోగులను చులకన చూడటంపై.. టీచర్లను.. అంగన్వాడీలను అడ్డుకోవడంపై.. అడ్డంగా అమ్ముతున్న మీ బినామీల మద్యంపై, నిజంగానే స్మశానంలా మార్చిన అమరావతిపై, ఆ రైతుల కన్నీళ్లపై.., లాండ్ టైటిలింగ్ యాక్ట్ పై, మనుషులందరూ అసహ్యించుకునే మీ మంత్రుల మాటలపై, మీ ఇంట్లో జరిగిన హత్యపై.. దానిని మీరు కవర్ చేస్తున్నారనే ఓ చర్చపై, అభిప్రాయంపై.. సొంత కుటుంబాన్నే దూరం చేయడంపై....ఇలా చెప్పుకుంటా పోతే.. చాంతాడంత లిస్టు ఉంది. వీటన్నింటిపైనా చర్చ జరిగింది. కానీ వాటిని మీ సొంత చెవులు, కళ్లు ద్వారా పరిశీలిస్తే తెలిసేది. వేరే వాళ్లపై ఆధారపడితే.. మొన్న ప్రెస్‌మీట్‌లో ఆశ్చర్యపోయినట్లే ఆశ్చర్యపోవాల్సి వస్తుంది. ఫైనల్‌గా అన్నింటికంటే అసలు కారణం తెలుసా.. ఎవ్వరికీ సమాధానం చెప్పని .. ఎవ్వరి మాటా వినని మీ ధోరణిపై కూడా ప్రజలు తీర్పిచ్చారు. ఎక్కడైతే.. ప్రజల గురించి కామెంట్ చేసి.. దాని గురించి అడిగే అవకాశం ప్రెస్‌లో ఎవరికీ ఇవ్వకుండా లేచి వెళ్లిపోయారు చూశారా.. ఆ ధోరణిపైనే ప్రజలు సమాధానం ఇచ్చారు. నేను ఇచ్చాను మీరు నాకు ఓట్లేయాలి.. నేను ప్రభువును మీరు నాకు రుణపడి ఉన్నారు అనే మాటలపైనే తీర్పిచ్చారు. అదే ప్రెస్ మీట్‌లో ఆగి ఇంకో పది నిమిషాలు ఫేస్ చేసి ఉంటే.. మీకు ఎందుకు ఓట్లేయలేదో అక్కడే తెలిసేది. సరే.. జరిగింది మార్చలేరు జగన్ గారు.. కనీసం ఇప్పటికైనా మీ ధోరణి అయినా మార్చండి. సొంతంగా పార్టీ పెట్టి.. స్వయంగా సీఎంగా ఎదిగిన నేత మీరు. కేంద్ర స్థాయిలో ఉన్న అణచివేతలను ఎదుర్కొన్న ఫైటర్ . 2014 ఓటమిని కూడా ఇలాగే ఎదుర్కొన్నారు. రాజకీయాల్లో ఇవన్నీ సహజం. చంద్రబాబు కూడా మూడు సార్లు ఓడిపోయారు. మళ్లీ లేచారు. మీకూ చాన్స్ వస్తుంది. అందుకు ఏం చేయాలో చూడండి. జనాలని నిందిస్తే.. మాత్రం ఫలితం ఉండదు.

# వాడపల్లికి పోటెత్తిన భక్తులు

**కొత్తపేట** నైరుతి రుతుపవనాలు తాకిడితో వర్షాలు కురుస్తున్నప్పటికీ వర్షాన్ని సహితం లెక్కచేయకుండా తెల్లవారు జాము నుండే భక్తులు శనివారం కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తారు. ఏడు వరాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అంటూ విలసిల్లిన వాడపల్లి వెంకన్న భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం గా పిలుస్తారు.

ఏడు వారలు పాటు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే తమ కోర్కెలు ఖచ్చితముగా నెరవేరుతాయి అని భక్తులు నమ్మకం, ఆ నమ్మకం తో దేశం నలుమూలలు నుండి అధిక సంఖ్యలో భక్తులు రావడం విశేషం, ఇటీవల ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు కూడా దర్శనానికి వస్తున్నారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ,వేగుళ్ల జోగేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పసమట్ల ధర్మరాజు తోపాటు పలువురు రాజకీయ నాయకులు దర్శనానికి వచ్చారు.

ప్రతి రోజు స్వామి వారికీ మేలుకొలుపు, సుప్రభాత సేవ, తొలి హారతి తో సేవలు మొదలయ్యి, భక్తులు దర్శనం తో పాటు వారికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసి,భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు .

# డేటింగ్ యాప్‌తో కొత్త మోసాలు

**హైదరాబాద్ :** ఇప్పటివరకు అమ్మాయిలను ఎరగా వేసి సైబర్ మోసలకు పాల్పడిన ఎన్నో ఘటనలు మనం చూశాం. అయితే తాజాగా హైదరాబాద్ లో వాటికి మించిన మోసాలు వెలుగులోకి వస్తున్నాయి.డేటింగ్ యాప్ ముసుగులో కొందరు అమ్మాయిలు కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవలే కాలంలో చాలా మంది అబ్బాయిలు? అమ్మాయిల మోజులో పడిపోయి డేటింగ్ యాప్ లను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అదే అదునుగా చేసుకొని కొంత మంది పబ్ యజమానులు అమ్మాయిలతో కుమ్మక్కై భారీ మోసాలకు తెర లేపుతున్నారు.ఈ క్రమంలోనే డేటింగ్ పేరుతో పరిచయం అయిన ఓ అమ్మాయి? ఓ పబ్ ఓనర్ చేసిన దోపిడీ బట్టబయలు అయింది. శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి టెండర్ అనే డేటింగ్ యాప్ లో ఇటీవలే కాలంలో రితిక అనే అమ్మాయితో పరిచయం ఏర్పడింది.పరిచయం ఏర్పడిన మరుసటి రోజే సదరు యువతి కలుసుకుందాం అని చెప్పింది.

దీంతో ఇద్దరూ హైటెక్ సిటీ మెట్రో స్టేషన్ వద్ద కలుసుకున్నారు.

కాసేపు మెట్రో స్టేషన్ లోనే మాట్లాడుకున్నాక ఆ యువతి గ్యాలేరియా మాల్ లో ఉన్న మోష్ పబ్ కు వెళ్దామని కోరడంతో ఇద్దరూ పబ్ కు వెళ్లారు. అక్కడ ఆ యువకుడికి తియ్యని మాటలు చెప్పిన రితికా అతని చేత ఖరీదైన మద్యాన్ని ఆర్డర్ చేయించింది.ఇద్దరూ కలిసి మద్యం సేవించిన తరువాత యాజమాన్యం బిల్ వేయగా.... సాధారణం కంటే మూడింతలు అధికంగా బిల్ వేశారు.

ఇదేంటని ప్రశ్నించినా.... సదరు యువకుడి నుంచి బలవంతంగా పెద్ద మొత్తంలో డబ్బులు కట్టించుకున్నారు. ఇదంతా జరుగుతున్న యువతి రీతికా మాత్రం తనకు? పబ్ కు ఎలాంటి సంబంధం లేనట్టుగా నటించింది.తనకు ఇలా జరగడంపై అనుమానం వ్యక్తం చేసిన యువకుడు ఆ పబ్ గురించి ఆన్ లైన్ లో రీసెర్చ్ చేశాడు. అయితే తనలాగే అనకే మంది ఇలాగే ట్రాప్ లో పడి మోసపోయారాని గ్రహించాడు. చేసేదేం లేక తనకు జరిగిన మోసాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసుకున్నాడు. తనలా ఎవరూ మోసపోవద్దని సూచించాడు. ప్రస్తుతం ఆ పబ్ బిల్స్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి

# బాండ్లు సేకరిస్తున్న విశాఖ కార్పొరేషన్

**విశాఖపట్టణం :** లోక్‌సభ ఎన్నికల ముందు కొద్దిగా మందగించిన బాండ్ మార్కెట్, ఇప్పుడు మళ్లీ రైజింగ్‌లో ఉంది. నేషనల్ మీడియా రిపోర్ట్స్ ప్రకారం, ఆరు మున్సిపల్ కార్పొరేషన్లు బాండ్లను జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. విశాఖపట్నంతో పాటు నాసిక్, కాన్పూర్, సూరత్, వారణాసి, ప్రయాగ్‌రాజ్ వంటి 6 పెద్ద నగరాల సివిక్ బాడీలు బాండ్ మార్కెట్‌లోకి అడుగు పెట్టబోతున్నాయి. ఇవన్నీ.. మునిసిపల్ బాండ్లు జారీ చేసి డబ్బు సేకరించేందుకు సిద్ధంగా ఉన్నాయని జాతీయ మీడియా వార్తలను బట్టి తెలుస్తోంది. ఈ మునిసిపల్ బాడీలు వచ్చే నెల (జులై 2024) చివరిలోగా మునిసిపల్ బాండ్లను జారీ చేయవచ్చు. దీనర్థం... వచ్చే నెలన్నర రోజులు బాండ్ మార్కెట్‌లో చాలా బిజీని మనం చూడబోతున్నాం. రిపోర్ట్స్‌ను బట్టి చూస్తే... బాండ్ల జారీ ద్వారా మునిసిపల్ కార్పొరేషన్లు 100 కోట్ల రూపాయల నుంచి 300 కోట్ల రూపాయల వరకు సేకరించే ఛాన్స్ ఉంది.

బాండ్ల జారీని సింపుల్‌గా చెప్పాలంటే... మునిసిపల్ సంస్థలు పెట్టుబడిదార్ల నుంచి అప్పు తీసుకుంటాయి, ఆ మొత్తాన్ని నిర్ణీత కాలం తర్వాత వడ్డీతో కలిపి చెల్లిస్తాయి. బాండ్లు కొనేవాళ్లకు ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను మునిసిపల్ కార్పొరేషన్లు ఆఫర్ చేయబోతున్నట్లు సమాచారం. బాండ్ ఇష్యూలపై పెట్టుబడిదార్లకు 7.9 శాతం నుంచి 8.3 శాతం వరకు వడ్డీ లభించొచ్చు.మునిసిపల్ కార్పొరేషన్లకు చాలా బాధ్యతలు ఉంటాయి. నగరాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కొనసాగించడానికి, ఇతర ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి మునిపల్ కార్పొరేషన్లకు డబ్బు కావాలి. బాండ్ల జారీ ద్వారా ఆ డబ్బును సమీకరించడం వాటి ముందున్న మార్గాల్లో ఒకటి. గతంలో, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూడా బాండ్ల జారీ ద్వారా నిధులు సేకరించింది. దీంతోపాటు... అహ్మదాబాద్, భోపాల్, ఇండోర్, పుణె, లఖ్‌నవూ మునిసిపల్ బాడీలు కూడా 2017 నుంచి 2024 మార్చి మధ్యకాలంలో బాండ్లను ఇష్యూ చేశాయి. ఈ 6 మునిసిపల్ సంస్థలు కలిసి, ఈ ఏడేళ్లలో సుమారు రూ.3,000 కోట్లు సమీకరించాయి. ఇటీవల, వడోదర మున్సిపల్ కార్పొరేషన్ కూడా 'సర్టిఫైడ్ గ్రీన్ మున్సిపల్ బాండ్'లను జారీ చేసి రూ.100 కోట్లు సేకరించింది. ఈ డబ్బును మంచినీటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఉపయోగిస్తుంది.ప్రస్తుతం, మునిసిపల్ కార్పొరేషన్లు ప్రారంభించే మునిసిపల్ బాండ్లలో పెట్టుబడి పెట్టడానికి సంస్థాగత పెట్టుబడిదార్లకు మాత్రమే అనుమతి ఉంది. రిటైల్ పెట్టుబడిదార్లకు కూడా అవకాశం కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ దిశలో, గత సంవత్సరం విడుదలైన ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ బాండ్లు మొట్టమొదటివి. సోలార్ పవర్ ప్రాజెక్ట్ కోసం తీసుకొచ్చిన ఆ ఇష్యూలో ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ రూ.244 కోట్లు సమీకరించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కూడా డబ్బును పెట్టుబడి పెట్టిన మొదటి మునిసిపల్ బాండ్ ఇష్యూ అదే.

# అప్పలనాయుడు ఫ్లైట్ టిక్కెట్ తీయాలా...

## - విజయనగరం ఎంపీని అడిగిన బాబు

**విజయవాడ :** ఏపీ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు వెలుగు చూశాయి. సామాన్యులు సైతం ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. రంపచోడవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా అంగన్వాడీ టీచర్ ఎన్నికయ్యారు. కొద్ది సంవత్సరాలుగా రంపచోడవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరలేదు. గత రెండు ఎన్నికల్లో అక్కడ వైసీపీ అభ్యర్థులే ఎన్నికవుతూ వచ్చారు. అయితే ఈసారి అక్కడ పార్టీ జెండా ఎగురవేయాలని చంద్రబాబు భావించారు. అంగన్వాడీ టీచర్ గా ఉన్న శిరీషా దేవిని రంగంలోకి దించారు. ఆమెకు అన్ని విధాలుగా ఆర్థిక వనరులు సమకూర్చారు. దీంతో ఆమె అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఒక సామాన్య అంగన్వాడీ టీచర్ ఎమ్మెల్యేగా మారారు. అటు విజయనగరం ఎంపీగా గెలిచిన కలిశెట్టి అప్పలనాయుడు పరిస్థితి కూడా అదే. ఆయన ఓ సామాన్య నాయకుడు. ఆర్థికంగా కూడా అంతంత మాత్రమే. కానీ ఆయన సీనియారిటీని, సిన్సియారిటీని మెచ్చి టిక్కెట్ ఇచ్చారు.

అనూహ్యంగా అక్కడ నుంచి ఎంపీగా గెలిచారు అప్పలనాయుడు.సాధారణంగా చంద్రబాబు అంటే కార్పొరేట్ స్థాయి అని అందరూ అనుకుంటారు. కానీ ఆయన పార్టీ శ్రేణుల ఆర్థిక స్థితిగతులను కూడా తెలుసుకుంటారని నిన్ననే తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన ఎంపీలతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వారికి దిశ నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సమస్యలు, కేంద్ర ప్రభుత్వ పరంగా రావాల్సిన ప్రాజెక్టులు, రాయితీల విషయంలో గట్టిగా పోరాటం చేయాలని కూడా పార్టీ ఎంపీలకు చంద్రబాబు సూచించారు. తనను తరచూ కలుసుకోవాలని.. ఎటువంటి ఆంక్షలు ఉండవని కూడా తేల్చి చెప్పారు. అయితే సమావేశం చివరిలో విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ను తన వద్దకు పిలిపించుకున్నారు చంద్రబాబు.అప్పలనాయుడిది ఓ సాధారణ కుటుంబం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అందున బొత్స కుటుంబ అడ్డాలో పోటీ చేశారు. రెండు లక్షల 50 వేలకు పైగా మెజారిటీ సాధించారు. చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు కేడర్ గట్టిగానే ఫైట్ చేసింది. అటు అప్పలనాయుడు కమిట్మెంట్ సైతం చంద్రబాబుకు నచ్చింది. అందుకే ప్రత్యేకంగా అప్పలనాయుడును పిలిపించుకున్న చంద్రబాబు అభినందించారు. ఏం అప్పలనాయుడు ఫ్లైట్ టికెట్ తీసుకున్నావా? లేకుంటే మనవారికి ఎవరికైనా తీయమంటావా? అని చంద్రబాబు అనేసరికి అప్పలనాయుడు కళ్ళు చెమర్చాయి. అధినేత మాటలకు ఒక్కసారిగా ఫిదా అయిపోయారు అప్పలనాయుడు. వినమ్రతతో చంద్రబాబుకు నమస్కారం చేశారు. చంద్రబాబు దగ్గరకు తీసుకుని ఆశీర్వదించారు. ఆత్మీయతను పంచారు. సోషల్ మీడియాలో ఈ దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి

## ప్రజాజీవితంలో లేని పవర్ ఫుల్ లీడర్

# రామోజీరావు

మీడియాను నిఖార్సైన ప్రతిపక్షంగా నిలపడంలో ఆయన దేనికీ భయపడలేదు. ఏమీ ఆశించలేదు. ఆ తత్వమే ఆయనను ప్రజాస్వామ్యంలో మీడియా ప్రతిపక్ష ధీరునిగా నిలబెట్టింది.

### ఎలాంటి వేధింపులనైనా ఎదుర్కొన్న ధైర్యశాలి

ఇందిరాగాంధీ హయాంలో ఎదురైన వేధింపుల దగ్గర నుంచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి , జగన్మోహన్ రెడ్డి హయాంలో ఎదురైనా ఇబ్బందులను కూడా ఆయన గట్టిగా ఎదుర్కొన్నారు కానీ ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదు. ఓ సందర్భంలో శాసనమండలిలో జరిగిన రభసపై ఈనాడు పత్రికలో పెట్టిన హెడ్ లైన్ ను కారణం చూపి ఆయనను అరెస్టు చేయాలనుకున్నారు. కానీ సాధ్యం కాలేదు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆయన ఆస్తులపై దాడి చేశారు. మార్గదర్శిపై ఆరోపణలు చేశారు. కానీ ఏమీ చేయలేకపోయారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మార్గదర్శి విషయంలో వ్యవహారించిన తీరు ఎలా ఉందో ప్రజలందరూ చూశారు. కానీ ఎక్కడా తగ్గలేదు. అన్నింటినీ తట్టుకుని నిలబడ్డారు.

### రామోజీరావు ప్రముఖుల్ని కలవడం తక్కువ - వారే కలుస్తారు !

రామోజీరావు ఏ రంగంలో అడుగుపెట్టినా సెలబ్రిటీగా నిలిచారు. అయితే ఆయన ఫలానా పని ఆశించడం కానీ చేయించుకోవడం కానీ తన జీవితంలో చేసి ఉండరు. హైదరాబాద్ వస్తే ప్రధాని మోదీ, అమిత్ షా వంటి వారు రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లి ఆయనతో మాట్లాడి వెళ్తారు. నిజానికి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి రామోజీరావుతో మోదీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈటీవీ గుజరాత్ రామోజీ ఫిల్మ్ సిటీ నుంచి ఆపరేట్ చేసేవారు. అప్పట్లో మోదీ హైదరాబాద్ వస్తే ఖచ్చితంగా ఫిల్మ్ సిటీకి వెళ్లి రామోజీరావును కలిసేవారు. ప్రధాని అయిన తర్వాత కూడా కలిశారు.

### వ్యక్తిత్వమే రామోజీరావు పవర్

రామోజీరావు ఎప్పుడూ ప్రజా జీవితంలోకి రాలేదు. ఎప్పుడూ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. ఎప్పుడూ తాను పెట్టుకున్న విలువల్ని, పెట్టుకున్న గీతల్ని దాటాలని అనుకోలేదు. దాటితే ఎంత లాభం వస్తుందని ఆలోచన కూడా మనసులోకి రానివ్వలేదు. విలువల మీద నడిచే వ్యాపార సామ్రాజ్యాలను నిర్మించారు. అందుకే కరుడుగట్టిన నియంతలు దాడి చేసినా వాటి పునాదుల్ని బలహీనం చేయలేకపోయారు. నమ్మిన సిద్ధాంతానికి ఆయన కట్టుబడ్డారు.

## రామోజీరావు పార్థివదేహానికి ప్రముఖుల నివాళులు

సాధారణ కుటుంబంలో పుట్టి ఈ స్థాయికి ఎదిగారని గుర్తు చేసుకున్నారు. ఒక యుగపురుషుడు చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నానన్న చంద్రబాబు నిత్యం తెలుగుజాతి కోసం, సమాజహితం కోసం పరతపించారని కొనియాడారు. పల్లెటూరులో సాధారణ కుటుంబంలో పుట్టిన రామోజీరావు నిరంతర కృషితో అసాధారణ వ్యక్తిగా ఎదిగారంటూ చంద్రబాబు కొనియాడారు. ఈనాడు, ఈటీవీ వంటి సంస్థలు స్థాపించి ప్రజలను చైతన్యవంతులను చేశారని అన్నారు. రామోజీరావుతో తనకు 40 ఏళ్ల నుంచి పరిచయం ఉందని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. బ్రతికి ఉన్నంతకాలం ప్రతి నిమిషం ప్రజల కోసం తపిస్తూ, వారికోసం పనిచేశారని.. పనిచేస్తూ చనిపోతేనే తనకు ఆనందమని ఆయన చెప్పేవారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. తనకు ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు రామోజీరావు ఎంతో ధైర్యం చెప్పేవారని ఎన్నికల సమయంలో ఆయన ధర్మంవైపే నిలబడ్డారని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రామోజీరావు అంటే ఓ విశ్వసనీయతగా పేర్కొన్న చంద్రబాబు నాయుడు.. తెలుగుజాతి గుండెల్లో చిరస్థాయిగా ఉండే వ్యక్తి అని అభివర్ణించారు. అలాంటి వ్యక్తి ఇక లేరంటే బాధేస్తోందని.. ఆయనన స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తామని చంద్రబాబు చెప్పారు.

### రామోజీరావులో నేను ఓ చిన్నపిల్లవాడిని చూశా : చిరు

అందరూ రామోజీరావులోని గాంభీర్యాన్ని చూస్తే తాను మాత్రం చిన్నపిల్లాడిని చూశానని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. మీడియా దిగ్గజం రామోజీరావు పార్థివదేహానికి శనివారం మధ్యాహ్నం నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ రామోజీ కలలను, ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకువెళ్లాలన్నారు. రామోజీరావుతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. తాను ప్రజారాజ్యం పార్టీని స్థాపించినప్పుడు ఆయన సలహాలు, సూచనల కోసం కలిసేవాడినని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఓ పెన్ను ఇస్తే ఎంతో సంతోషంగా తీసుకుని... సంబరపడ్డారని తెలిపారు. ఆయన దాచుకున్న పెన్నులను తనకు చూపించారన్నారు. రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అన్నారు. తెలుగు జాతి ఒక పెద్దను కోల్పోయిందన్నారు. ఆయన సమాజహితం కోసం పని చేశారన్నారు. సమాజానికి ఏం చేయాలో నిత్యం అక్షరరూపంలో రాసేవారన్నారు.

### ప్రమాణ స్వీకారం తరువాత రావాలనుకున్నట్టు చెప్పిన పవన్

తాను ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత వచ్చి రామోజీరావును కలవాలనుకున్నానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మీడియా దిగ్గజం రామోజీరావు పార్థివదేహానికి ఆయన నివాళులర్పించారు. శనివారం ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న జనసేనాని రామోజీరావు పార్థివదేహం వద్ద పూలమాల ఉంచి నమస్కరించారు. జనసేనానితో పాటు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత చినబాబు నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రామోజీరావు మరణవార్త దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ప్రభుత్వాలు ఎన్ని ఇబ్బందులు పెట్టినా తట్టుకుని నిలబడి ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. తెలుగు మీడియాలో పని చేస్తోన్న వేలాదిమంది జర్నలిస్టులు ఈనాడు జర్నలిజం స్కూల్ నుంచి వచ్చినవారే అన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించడం ద్వారా తెలుగు సినీ పరిశ్రమకు ఎంతో సేవ చేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు సంస్థల ఉద్యోగులకు సానుభూతి తెలిపారు.

### విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీరావు చిహ్నంగా నిలిచిపోతారు : కేటీఆర్

విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీరావు చిహ్నంగా చిరకాలం నిలిచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలుగు పత్రికారంగం, ప్రసారమాధ్యమాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకు వచ్చారన్నారు. తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం తపనపడేవారన్నారు. దేశం, రాష్ట్రం బాగుండాలని కోరుకునే వ్యక్తి రామోజీరావు అన్నారు. భవిష్యత్తు గొప్పగా ఎలా ఉండాలో కలిసినప్పుడల్లా చెప్పేవారన్నారు. ఆయన ఒక మొబైల్ ఎన్‌సైక్లోపీడియాలా మాట్లాడేవారని ఆయన మరణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి తీరని లోటు అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు ఎప్పుడూ స్ఫూర్తిని ఇస్తాయన్నారు.

### రామోజీరావు ఒక వ్యక్తి కాదు, శక్తిమంతమైన వ్యవస్థ: వెంకయ్య నాయుడు

రామోజీరావు ఒక వ్యక్తి కాదని, శక్తిమంతమైన వ్యవస్థ అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఒక అఖండ జ్యోతి ఆరిపోయిందన్నారు. ఆయన స్వయంకృషితో కష్టపడి అన్ని రంగాల్లో విజయం సాధించారని పేర్కొన్నారు. ఒక ధ్రువతారలా నిరంతరం వెలుగుతూ ఉంటారన్నారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్తు తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయనతో మాట్లాడటం వల్ల ఎంతో పరిపక్వత సాధించినట్లు చెప్పారు. ఆయన ఒక పోరాట యోధుడు అనుకున్న విజయాలు సాధించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆరోగ్యశ్రీలో 65 కొత్త చికిత్సలు

అమలు చేయాలని నిర్ణయించారు. వీటితో పాటు ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ లో ఉన్న 98 చికిత్సా విధానాలు ఆరోగ్యశ్రీలో చేర్చడం ద్వారా ప్రభుత్వంపై దాదాపు 189.83 కోట్ల భారం పడనుంది. 65 కొత్త చికిత్సా విధానాలు అంగీకరించడం వల్ల ప్రభుత్వ%శీ% 158.20 కోట్ల ఖర్చు చేయనుందని తెలిపారు. ఓవరాల్‌గా పై సవరణల వల్ల, కొత్త చికిత్సా విధానాలు చేర్చడం కోసం, ప్రభుత్వం అదనంగా 497.29 కోట్లు మంజూరు చేసినట్లు ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

## నేడే ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం

అటు, రాష్ట్రపతి భవన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ వంటి పారా మిలిటరీ బలగాలు, ఎన్ఎస్ జీ కమాండోలు, స్నైపర్లు, డ్రోన్ పహారాతో భద్రత కల్పిస్తున్నారు. రాష్ట్రపతి భవన్ లోపల, బయట మూడంచెల భద్రతను అమలు చేస్తున్నారు. తనిఖీల నిమిత్తం ఏఐ పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. నేడు ఉదయం నుంచి రాష్ట్రపతి భవన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి.

## బీఆర్ఎస్ పునరుజ్జీవానికి ప్లాన్లేంటి.?

ఆగిపోయింది.

### బీజేపీ కోసం బీఆర్ఎస్ ఆత్మబలిదానం చేసుకుందన్న రేవంత్

ఈ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ బీజేపీ కోసం ఆత్మ బలిదానం చేసుకుందని రేవంత్ రెడ్డి విమర్శించారు. పరిస్థితి చూస్తుంటే అదే నిజమన్న అభిప్రాయం అందరికీ కలుగుతోంది. బీఆర్ఎస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా బీజేపీకి సహకరించిందని మొదటి నుంచి విమర్శలు ఉన్నాయి. లేకపోతే సిద్దిపేట లాంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓట్లు బీజేపీకి వెళ్లడం అసాధారణమైన విషయం. బీజేపీతో అంతర్గత ఒప్పందం ఉందో లేదో కానీ బీఆర్ఎస్ చీఫ్ మాత్రం బీజేపీకి అనుకూలంగా వ్యవహరించాలన్న సంకేతాలు పంపారని అందకే ఓట్లు ఏకపక్షంగా బీజేపీకి వెళ్లాయని అంటున్నారు. బహుశా కాంగ్రెస్ కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తే బీజేపీ రేవంత్ సర్కార్ ను కూలదోస్తుందని తమ ఆధ్వర్యంలో బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని కేసీఆర్ ఆశించినట్లుగా తెలుస్తోంది. కానీ ఇప్పుడు పరిస్థితి రెంటికి చెడ్డ రేవడి అయింది. బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాకపోగా బీజేపీ సీట్లు గెల్చుకుంది కానీ కాంగ్రెస్ తో సమానంగానే. ఎక్కువ సీట్లు సాధించలేదు. అదే సమయంలో కేంద్రంలో బీజేపీ బలహీనపడింది. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. కాంగ్రెస్ బలపడింది. ఇలాంటి సమయంలో రేవంత్ సర్కార్ ను కూల్చే ఆలోచన పెట్టుకోదు.

### రాజకీయ భవిష్యత్ ఉండాలంటే బీఆర్ఎస్‌ను వీడాలని ఎమ్మెల్యేలకు బయట నుంచి సలహాలు

బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ని త్యాగం చేయడం వల్ల మొదటికే మోసం వచ్చే పరిస్థితి ఏర్పడింది. నేనే బీఆర్ఎస్ లీడర్ని అయితే.. బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్‌పై ఖచ్చితంగా ఆందోళన చెందుతానని ప్రశాంత్ కిషోర్ ఎన్నికలకు ముందే చెప్పారు. ఇప్పుడు దాన్నే బూచిగా చూపిస్తే కాంగ్రెస్ కొత్త రాజకయం చేస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీలోకి రావాలని దానం నాగేందర్ ఆహ్వానిస్తున్నారు. లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ పార్టీకి కనీసం డిపాజిట్లు కూడా రాలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచిన నియోజకవర్గాల్లోనూ డిపాజిట్లు రాలేదని చెప్పుకొచ్చారు. కాబట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వారి రాజకీయ భవిష్యత్తు కోసం, రాజకీయ మనుగడ కోసం కాంగ్రెస్ పార్టీలోకి రావాలని సలహాలిచ్చారు. రాజకీయంగా ప్రజాక్షేత్రంలో ఉండాలని కోరుకునే వారు ప్రజాసేవ చేయాలని కోరుకునే వారు కాంగ్రెస్ పార్టీలోకి రావాలన్నారు. కాంగ్రెస్ లోకి స్తే రేవంత్ రెడ్డి వారికి తగిన గౌరవం ఇస్తారని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ లోకి ఎందుకు రావాలో వారికి డౌట్ వస్తుంది బీజేపీలోకి వెళ్లొచ్చు కదా అనుకుంటారు. అందుకే దానికీ దానం నాగేందర్ క్లారిటీ ఇచ్చారు. అయోధ్యలోని లోక్ సభ నియోజకవర్గంలోనే ఆ పార్టీ ఓడిపోయిందన్నారు. అలాగే వారణాసిలో 2019లో ఐదు లక్షలకు పైగా మెజార్టీ వచ్చిన మోదీకి ఈసారి లక్షకు పైగా మాత్రమే వచ్చిందన్నారు. ఈ కారణంగా బీజేపీకి భవిష్యత్ ఉండదని అంతా కాంగ్రెస్ హవానేనని అందుకే కాంగ్రెస్ లోకి రావాలంటున్నారు. దానం కంటే ముందే చాలా మంది కాంగ్రెస్ లోకి ఎమ్మెల్యేలను ఆహ్వానించారు. వస్తారని ప్రకటనలు చేశారు.

### రెండు జాతీయ పార్టీలతో పోరు బీఆర్ఎస్‌కు కష్టమే

బీఆర్ఎస్‌కు పోటీగా రెండు జాతీయ పార్టీలు ఉన్నాయి. ఒకటి రాష్ట్రంలో అధికారంలో ఉంది. మరొకటి కేంద్రంలో అధికారంలో ఉంది. ఓడిపోయి నిస్సహాయ స్థితిలో ఉన్న పార్టీ రెండు జాతీయ పార్టీలతో పోరాడటం అంటే కేసీఆర్ కు బీఆర్ఎస్‌కు అంత తేలిక కాదు. అందుకే భిన్నమైన రాజకీయం చేయబోయి నలిగిపోయారు. బీజేపీ లక్ష్యం ప్రాంతీయపార్టీల్ని అమాంతం మింగేయడం. తెలంగాణలో అలాంటి చాన్స్ ఉందని మోదీ, షాలకు తెలుసు. ఇలాంటి సందర్భంలో ఎలా వ్యవహరించాలో వారికి బాగా తెలుసు. ఈ రాజకీయాల్లో వారు మాస్టర్లు. అందుకే బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని అద్భుతంగా నడిపించారు. రాష్ట్రంలో రెండే పార్టీలు ఉంటే ఏమీ చేయకపోయినా అధికారపార్టీపై కోపంతో ప్రతిపక్షంకి ఓట్లేస్తారు. కానీ మూడు పార్టీలు ఉంటే ప్రజలకు ప్రత్యామ్నాయం ఉన్నట్లే. బీఆర్ఎస్ ఈ లాజిక్ ను అర్థం చేసుకుని కష్టపడాల్సి ఉంది. ఇందు కోసం కేసీఆర్ వద్ద ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో క్యాడర్ కూ అర్థం కావడం లేదు.

## లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ

కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్ గాంధీని కోరారు. ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సీడబ్ల్యూసీ సమావేశం ముగిసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ అధికార ప్రతినిధి జైరామ్ రమేశ్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించాలని సీడబ్ల్యూసీ సమావేశంలో తాము ఏకగ్రీవంగా ప్రతిపాదన చేశామని కేసీ వేణుగోపాల్ తెలిపారు. అయితే తాము చేసిన ప్రతిపాదనపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని రాహుల్ గాంధీ చెప్పినట్లు కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. సాధ్యమైనంత త్వరలో తన నిర్ణయాన్ని వెల్లడిస్తానని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు. ఇక ఈ లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో రెండు చోట్లా గెలిచిన రాహుల్‌గాంధీ ఏ స్థానానికి రాజీనామా చేస్తారని మీడియా అడిగిన ప్రశ్నకు కేసీ వేణుగోపాల్ సమాధానం ఇచ్చారు. రాయ్‌బరేలీ, వయనాడ్ నుంచి గెలిచిన రాహుల్ గాంధీ రెండు నియోజకవర్గాల్లో ఏదో ఒక స్థానాన్ని వదులుకునేందుకు ఈ నెల 15 వ తేదీ వరకు గడువు ఉందని కానీ ఈ 3, 4 రోజుల్లో రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటారని కేసీ వేణుగోపాల్ చెప్పారు. నితీష్ కుమార్ ఇండియా కూటమి వైపు వస్తే ప్రధానమంత్రి పదవి ఇస్తామని ఆఫర్ చేసినట్లు జేడీయూ నేత కేసీ త్యాగి పేర్కొన్నారని మీడియా అడిగిన ప్రశ్నకు.. ఆ విషయం తనకు తెలియదని తెలిపారు.

## అమెరికా పర్యటనలో తెలంగాణ మంత్రులు

ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ పెట్టుబడుల శాఖ స్పెషల్ సెక్రెటరీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి ఈ ప్రజెంటేషన్ ఇచ్చారు.

### ప్లాంట్ ఎక్కడ పెట్టినా సహకారం అందిస్తామన్న మంత్రులు

తెలంగాణలోఎక్కడ ప్లాంట్ స్థాపించినా అందుకు ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని కోకా-కోలా ప్రతినిధులకు మంత్రి శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు హామీ ఇచ్చారు.

భారత దేశంలో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని, గత రెండు దశాబ్ధాలుగా హైదరాబాద్ లో అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని మంత్రుల బృందం జోనథన్ కు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పట్ల సానుకూలంగా స్పందించిన జోనథన్ హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు.

### డెల్టా ఎయిర్ లైన్స్‌తోనూ సమావేశం

శుక్రవారం అట్లాంటాలో డెల్టా ఎయిర్‌లైన్స్ సీటీవో నారాయణన్ కృష్ణకుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయని, ప్రభుత్వం అన్ని రకాలుగా సౌకర్యాలూ కల్పిస్తుందని శ్రీధర్‌బాబు వివరించారు.

ప్రజెంటేషన్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన కృష్ణకుమార్, డెల్టా ఏవియేషన్ టీమ్.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసింది. హైదరాబాద్ నుంచి అట్లాంటాకు నేరుగా విమానం నడపాలంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. డెల్టా ఎయిర్‌లైన్స్ యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయ.

### కాంగ్రెస్ మంత్రుల పర్యటనలో కీలకంగా జయేష్ రంజన్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి సారిగా పెట్టుబడుల కోసం ప్రభుత్వ బృందం అమెరికాకు వెళ్లింది. బీఆర్ఎస్ హయాంలోనూ కీలకంగా వ్యవహరించిన సీనియర్ ఆఫీసర్ జయేష్ రంజన్ కాంగ్రెస్ హయాంలోనూ పెట్టుబడుల పర్యటనల విషయంలో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు.

## అధికారిక లాంఛనాలతో రామోజీ అంత్యక్రియలు

భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటించారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. సీడబ్ల్యూసీ సమావేశంలో కోసం రేవంత్ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ఆదేశాలు జారీచేశారు.

## నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలు

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించిన నీట్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌లో ఎన్నడూ లేని విధంగా 67 మంది విద్యార్థులు 720 కి 720 మార్కులతో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఈ ఫలితాలు గమనిస్తే ఏదో మతలబు జరిగిందని, వైద్య విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ ఫలితాలలో 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రాగా, చాలా మంది విద్యార్థులకు 718, 719 మార్కులు సైతం రావడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీట్ లో (ం4, -1) మార్కింగ్ విధానం ఉన్నందున, అసలు 718, 719 మార్కులు రావడం అనేది అసాధ్యమన్నారు. ఎవరైనా దీనిపై ప్రశ్నిస్తే 'గ్రేస్ మార్కులు' ఇచ్చామని సాకులు చెబుతున్నారు. కొంతమంది విద్యార్థులకు ఏకంగా 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చి ఉంటారని ఆరోపించారు. అయితే ఆ గ్రేస్ మార్కుల కోసం ఏ విధానం పాటించారనేది మాత్రం చెప్పకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోంది. నీట్ రిజల్ట్స్‌ను ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా ఎందుకు విడుదల చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ భవిష్యత్తులో మరిన్ని సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీట్ ఫలితాలతో పాటు మరికొన్ని అంశాలపై ప్రశ్నలు, డిమాండ్లను కేటీఆర్ కేంద్రం ముందు ఉంచారు.

### కేంద్రానికి కేటీఆర్ ప్రశ్నలు, డిమాండ్లు

1) ఏ ఒక్క తెలంగాణ విద్యార్థి కూడా నీట్ లో టాప్ 5 ర్యాంక్‌లో లేకపోవడం గత 5 ఏళ్లలో ఇది తొలిసారి. నీట్ ఎగ్జామ్ లో జరుగుతున్న అవకతవకలే అందుకు కారణమని భావిస్తున్నాం.
2) నీట్ ఎగ్జామ్ ఫలితాలలో గ్రేస్ మార్కుల కేటాయింపు కోసం అనుసరించిన విధానాన్ని బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సరైన పద్ధతిలో ప్రతి విద్యార్థికి మేలు జరిగేలా నీట్ ఉండాలని బీఆర్ఎస్ కోరుతోంది. కేవలం 1500 మంది విద్యార్థులకు మాత్రమే మేలు చేసేందుకు గ్రేస్ మార్కులు కలిపారు. అది సరి కాదు.
3) నీట్ ఎగ్జామ్ వ్యవహారంపై ఉన్నతస్థాయి నిపుణుల కమిటీతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్. తాజా విధానంతో అన్యాయం జరిగిన విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు ఈ అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## వ్యక్తి నుంచి వ్యవస్థ దాకా...

**హైదరాబాద్ :** రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీ రావు మృతి తెలుగు వారందరికీ పెద్ద లోటుగా అభివర్ణించారు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు. "ఈనాడు వ్యవస్థాపకులు, ఆత్మీయులు రామోజీరావు గారు పరమపదించారని తెలిసి విచారించాను. క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతలతో అడుగుపెట్టిన ప్రతి రంగంలో వారు సృష్టించిన నూతన ఒరవడి ఆదర్శనీయమైనది. తెలుగు భాష-సంస్కృతులకు వారు చేసిన సేవ చిరస్మరణీయమైనది. తెలుగు వారి వెలుగు, మార్గదర్శి అయినా ఈనాడు పత్రిక మరియు రామోజీ ఫిల్మ్ సిటీ ద్వారా ప్రపంచానికి తెలుగు వారి ఘనతను చాటిన వారి క్రాంతదర్శనం స్ఫూర్తిదాయకమైనది. రామోజీ రావు వ్యక్తి కాదు, శక్తివంతమైన వ్యవస్థ. వ్యక్తిగా మొదలై వ్యవస్థగా ఎదిగిన వారి జీవితం నుంచి యువతరం నేర్చుకోవలసిన పాఠాలు ఎన్నో ఉన్నాయి. తెలుగు వారందరికీ గర్వకారణమైన రామోజీరావు లేని లోటు పూడ్చలేనిది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను."స్వయంగా తనను తాను చెక్కుకొని ఎదిగిన దిగ్గజం రామోజీరావు మరణ వార్త తనను చాలా కలచి వేసిందన్నారు లోక్‌సత్తా వ్యవస్థాకులు జయప్రకాష్ నారాయణ. " రామోజీరావు మరణం తెలుగు సమాజానికి, భారతీయ జర్నలిజానికి తీరని లోటు. రాజీలేని, స్వీయ-నిర్మిత దిగ్గజం, అతను ఎల్లప్పుడూ నిర్భయ పోరాట పటిమ, అంకితభావం, ఆవిష్కరణ, సమగ్రత, విశ్వసనీయత, రైతుల, ప్రజా సంక్షేమం కోసం నిలబడ్డారి. దాదాపు అయిదు దశాబ్దాల పాటు మీడియా ప్రపంచంలో మహా శక్తిలా ఎదిగిన ఆయన తెలుగు మాట్లాడే ప్రజల ఆధునిక చరిత్రలో అంతర్భాగంగా నిలిచారు. తెలుగు ప్రజలు ఒక ఛాంపియన్‌ను కోల్పోయారు. జర్నలిజం ఒక యోధుడిని కోల్పోయింది. నేను గొప్ప స్నేహితుడిని కోల్పోయాను. ఆయన సేవలు, జ్ఞాపకాలు చిరకాలం నిలిచే ఉంటాయి. "రామోజీరావు మృతి పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సంతాపం తెలియజేశారు. తెలుగు భాషకు ఆయన సేవలు మరువలేనివని అన్నారు. రామోజీరావు తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని పురందేశ్వరి అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల రామోజీ రావు మృతి పట్లగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ఎమ్మెల్యే,ఎంపి

**తిరుమల** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ కృష్ణ, కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో శ్రీవారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం వీరికి ఆలయ రంగనాయక మంటపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం ఇవ్వగా, టిటిడి అధికారులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ అహంకార నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. తెలంగాణలో కేసిఆర్ కు, ఏపిలో జగన్ కు, కేంద్రంలో మోడీకి. కేంద్రంలో మోడీకి ఆదరణ తగ్గింది, కాంగ్రెస్ పార్టీకి మంచి మెజారిటీ వచ్చింది.ఎన్డీయే ప్రభుత్వం ఈడీ, సిబిఐతో బెదిరిస్తూ గెలవాలని చూశారు. కాని ప్రజలు అంతా గమనిస్తున్నారు. పెద్దపల్లి ఎంపిగా వంశీకృష్ణ మంచి మెజారిటీతో గెలవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఎంపి వంశీకృష్ణ, మాట్లాడుతూ ప్రజల ఆదరణతో అత్యధిక మెజారిటీతో ఎంపిగా గెలవడం చాలా సంతోషంగా ఉంది. తిరుమల శ్రీవారి ఆశీశ్సులు తీసుకున్నాం. తాతయ్య కాకా వెంకట స్వామి అడుగుజాడలలో నడుస్తూ,ప్రజకతో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కేషి చేస్తాననని అన్నారు.

## కొడాలి నాని కబ్జా చేసిన తొమ్మిది ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న బాధితులు

**గుడివాడ** మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని కబ్జా చేసిన తొమ్మిది ఎకరాల భూమిని బాధితులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. రెండు జెసిబి లతో కబ్జా చేసిన భూమి చుట్టూ ఉన్న కంచెలను తొలగించారు. కొడాలి నాని అరాచకాలు నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసారు.
బాధితులు మాట్లాడుతూ బిడ్డల భవిష్యత్తు కోసం కొనుక్కున్న భూమిని తన అనుచరులతో కొడాలి నాని కబ్జా చేశాడు. ఇదేంటి అని ప్రశ్నిస్తే తమపై అక్రమ కేసులు పెట్టి. వేధించడమే కాకుండా తమపై దాడి చేయించాడు. న్యాయం కోసం పోలీసులను వేడుకున్నాం కోర్టులను ఆశ్రయించాం.. ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగాం. అయినా మాకు న్యాయం దక్కలేదు... వెనిగండ్ల రాము వల్లే నేడు మాకు న్యాయం జరిగింది. అందరినీ 420 అనే కొడాలి నాని నే అసలైన 420 . కొడాలి నాని నీ గుడివాడ నుండి తరిమి కొడతాం . మరలా కొడాలి నానిని రాజకీయాల్లోకి రాకుండా చేస్తాం. ఆశలు వదిలేసుకున్న తరుణంలో మా పాలిట దైవంలా వెనుగండ్ల రాము అండగా నిలబడ్డారు. ఇటువంటి మంచి వ్యక్తులు గుడివాడకు శాశ్వత ఎమ్మెల్యేగా ఉండాలని కోరుకుంటున్నాం. రాము ఎమ్మెల్యే గా ఉన్నంతకాలం గుడివాడకు అంత మంచే జరుగుతుందని బాధితులు అంటున్నారు.

## నేషనల్ మార్ట్‌ను ప్రారంభించిన ఎంపి ఓవైసీ

**హైదరాబాద్** నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. హైదరాబాద్ మెహదీపట్నంలో నేషనల్ మార్ట్ ను సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. నిత్యావసరాల నుంచి దుస్తుల వరకు అన్ని రకాల వస్తువుల ఒకేచోట అందుబాటులో ఉంచామ నిర్వాహకులు తెలిపారు. అన్ని రకాల ఉత్పత్తులపై భారీ డిస్కౌంట్ లు అందిస్తున్నట్లు యష్ అగర్వాల్ తెలిపారు.

## వివాహిత దారుణ హత్య

**ఖమ్మం** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి లో దారుణం చోటు చేసుకుంది.గ్రామానికి చెందిన వివాహితను శ్రీను అనే వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేశాడు.సైదమ్మ అనే వివాహిత ను శ్రీను గత కొంతకాలంగా వేధిస్తున్నాడు.

తనతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని శ్రీను అడుగుతుండగా ఆమె నిరాకరిస్తూ వస్తుంది.ఈ క్రమంలో సైదమ్మ ఒంటరిగా ఉండటం గమనించిన శ్రీను మరోసారి అడుగగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సైదమ్మ పై శ్రీను కత్తితో దాడి చేశాడు.ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ సైదమ్మ ను స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. జరిగిన హత్య పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రామోజీరావు కన్నుమూత

## - ఉషాకిరణ్‌తో సినీరంగ ప్రవేశం - దాదాపు 87 చిత్రాల నిర్మాణం - ఎందరో కొత్తవారికి తెర పరిచయం




పాత్రికేయంతో తెలుగు ప్రజలపై చెరగని ముద్ర వేసిన రామోజీ రావు.. సినీరంగంలోనూ ఎన్నో అద్భుతాలు సృష్టించారు. ఉషా కిరణ్ మూవీస్ సంస్థను స్థాపించి, వివిధ భాషల్లో 87 చిత్రాలను నిర్మించి ఎంతోమంది కొత్త నటీనటులను రంగుల పరిశ్రమకు పరిచయం చేశారు. సమున్నత పాత్రికేయ విలువలకు పట్టంగట్టే ఈనాడుకు అనుబంధంగా ప్రారంభమైనదే 'సితార' సినిమా వారపత్రిక. రంగుల లోకంలోని విశేషాలను సమగ్రంగా అందించేలా దాన్ని ప్రారంభించారు. 1976లో ఇది పాఠకుల ముంగిటకు వచ్చింది. కేవలం వార్తలు, కథనాలను అందించేందుకు పరిమితం కాకుండా విలువలున్న చిత్రాల్ని ప్రోత్సహించే దిశగానూ రామోజీ ఆలోచన చేశారు. ఆరోగ్యకరమైన వినోదాన్ని ప్రేక్షకులకు అందించాలనే సదుద్దేశంలో 1983లో రామోజీరావు ఉషాకిరణ్ మూవీస్‌ను ప్రారంభించారు. ఉషాకిరణ్ మూవీస్‌పై నిర్మించిన తొలి సినిమానే సూపర్ హిట్‌గా నిలిచింది. 'ప్రేమలేఖ' నవలను చిత్రంగా మలచాలని భావించారు. ఆ కథను తెరకెక్కించే



బాధ్యతను జంధ్యాలకు అప్పగించారు. ఆ సినిమానే 'శ్రీవారికి ప్రేమలేఖ'. ఈ చిత్రం 1984 మార్చిలో ప్రేక్షకుల ముందుకొచ్చి మెప్పు పొందింది. కథలనేవి కల్పనల్లోంచి కాదు.. జీవితాల్లోంచి పుడతాయని ఉషాకిరణ్ మూవీస్ నిరూపించింది. అందుకు ఉదాహరణెళి ఈ సంస్థ నుంచి వచ్చిన నాలుగో చిత్రం 'మయూరి'. ఒక హిందీ పత్రికలో వచ్చిన వార్తను సినిమాగా మలిచి జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించారు. ప్రమాదంలో కాలును పోగొట్టుకొని, కృత్రిమ పాదంతో నాట్యంలో రాణించిన సుధా చంద్రన్ జీవితాన్ని తెరపై ఆవిష్కరించారు. ఆ పాత్రలో సుధా చంద్రన్నే నటించారు. స్ఫూర్తివంతమైన ఆ చిత్రం వచ్చి రెండున్నర దశాబ్దాలు దాటిపోయినా ఉషాకిరణ్ మూవీస్ అనగానే 'మయూరి' తప్పకుండా గుర్తుకొస్తుంది. సినిమా అంటే రెండున్నర గంటలపాటు ఊహాలోకంలో విహరింపజేయడం మాత్రమే కాదని నిరూపించిన చిత్రమిది. మౌనపోరాటం -




యథార్థ సంఘటనలను తెరకెక్కించడంలో ఉషాకిరణ్ మూవీస్ కి ఓ ప్రత్యేకత ఉంది. ఒడిశాలో జరిగిన సంఘటన ఆధారంగా 'మౌన పోరాటం' చిత్రాన్ని నిర్మించారు. మగాడి చేతిలో మోసపోయిన ఓ వనిత పోరాటాన్ని ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారు. 1989లో విడుదలైన ఆ చిత్రం ఎందరినో ఆలోచింపచేసింది.ప్రతిఘటన - ఉషాకిరణ్ మూవీస్ సంస్థ ఏనాడూ కథానాయికనుగానీ, ఏ స్త్రీ పాత్రనుగానీ బలహీనంగా చూపించలేదు. ఆ పాత్రకు ఔచిత్యం, మనో ధైర్యం ఉండేలా తీర్చిదిద్దారు. ఇందుకు 'ప్రతిఘటన' తార్కాణం. సంఘ విద్రోహులతో పోరాడే తెగువ ఉన్న ఓ వనిత గాథను ఆవిష్కరించిన విధానం ప్రేక్షకుల మదిలో చెరిగిపోకుండా ఉంది. ఆ చిత్రంలోని 'ఈ దుర్యోధన...' పాటను ఎవరైనా మరువగలరా? ఆ పాటలోని సాహిత్యాన్ని ఆమోదించేందుకు



ముందుగా నిర్మాతకు సంకల్ప బలం కావాలి. అది రామోజీరావుకు ఉంది కాబట్టే రచయిత వేటూరి రాయగలిగారు... దర్శకుడు టి. కృష్ణ అంతే శక్తిమంతంగా చిత్రించగలిగారు.క్రీడా కారిణి అశ్విని నాచప్పను కెమెరా ముందుకు తీసుకొచ్చింది కూడా ఈ సంస్థే. క్రీడా నేపథ్యంలో స్ఫూర్తిదాయక చిత్రాన్ని నిర్మించాలన్న ఆలోచన నుంచి రూపుదిద్దుకున్నదే 'అశ్వని' కథ. ఆ పాత్రకు నిజ జీవితంలో క్రీడాకారిణి అయితే బాగుంటుందన్న ఆలోచనతోనే అశ్వని నాచప్పను ఎంచుకున్నారు. క్రీడలకే పరిమితమైన ఆమె.. కథ

నచ్చడంతోపాటు, ఉషాకిరణ్ మూవీస్ విశిష్టతను తెలుసుకుని నటించేందుకు పచ్చజెండా ఊపారు. ఇలా చెబుతూ వెళ్తే ప్రతి చిత్రం వెనక ఓ బలమైన నేపథ్యం, ఓ సంకల్పం ఉంటాయి. 'తేజ', 'మనసు మమత', 'అమ్మ', 'జడ్జిమెంట్', 'పీపుల్స్ ఎన్ కౌంటర్'... అన్నీ నాటి సామాజిక పరిస్థితులకు దర్పణం పట్టినవే. 'చిత్రం', 'నువ్వే కావాలి', 'ఆనందం' వంటి ఘనవిజయాలున్నాయి. 'నచ్చావులే', 'బెట్టింగ్ బంగా రాజు', 'నువ్విలా' లాంటి ప్రేక్షకులను ఉల్లాసపరిచే చిత్రాలు వచ్చాయి. 'నువ్వే కావాలి' సాధించిన వసూళ్లూ, సృష్టించిన రికార్డులూ ఆ ఏడాది ఏ మాస్ హీరోకీ తీసిపోనివే. చిన్న చిత్రాల రూపకర్తలకు ధైర్యాన్నిచ్చినవే. కొత్త ట్రెండ్ సృష్టించినవే. కేవలం తెలుగు చిత్రాలకే ఉషాకిరణ్ మూవీస్ పరిమితం కాలేదు. 'నాచే మయూరి', 'ప్రతిఘాత్', చిత్రాలతో బాలీవుడ్‌లోనూ జయకేతనం ఎగరేసింది. కన్నడ, తమిళ, మరాఠీ, ఆంగ్ల భాషల్లో ఇప్పటి వరకూ 87 చిత్రాలు నిర్మించిందీ సంస్థ. తొలి చిత్రం 'శ్రీవారికి ప్రేమలేఖ' నుంచే ప్రేక్షకుల మెప్పుతో పాటు ప్రభుత్వ పురస్కారాలూ వరించాయి. 'కాంచనగంగ', 'మయూరి', 'ప్రతిఘటన', 'తేజ', 'మౌనపోరాటం' లాంటి చిత్రాలకు నంది అవార్డులు దక్కాయి. 'మయూరి'లో నటించిన సుధాచంద్రన్‌కు ఏకంగా జాతీయస్థాయిలో ప్రత్యేక పురస్కారం లభించింది. 'నువ్వే కావాలి' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయస్థాయి అవార్డు అందుకుంది. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా ప్రేక్షకులకు చేరువైన నటీనటులు ఎందరో ఉన్నారు. ప్రతిభ ఉంటే చాలు అవకాశమిచ్చి ప్రోత్సహించారు. శ్రీకాంత్, వినోద్‌కుమార్, చరణ్ రాజ్, యమున, వరుణ్ రాజ్, ఎన్టీఆర్, ఉదయ్ కిరణ్, తరుణ్, రీమాసేన్, శ్రియ, జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్, రిచా పల్లోడ్, మాధవీలత... ఇలా ఎందరో నటులు ఈ సంస్థ ద్వారానే చిత్రసీమకు పరిచయమయ్యారు. గాయనిగా ఉన్న ఎస్. జానకి సంగీత దర్శకురాలైంది కూడా 'మౌనపోరాటం' చిత్రంతోనే. మల్లికార్జున్, ఉష, గోపికా పూర్ణిమ లాంటి గాయనీగాయకులను శ్రోతలకు చేరువ చేసింది కూడా ఈ సంస్థే. సినిమా తీయడం ఒక ఎత్తు. దాన్ని ప్రేక్షకుల ముంగిటకు తీసుకువెళ్లడం మరో ఎత్తు. చిత్ర నిర్మాణంతోపాటే పంపిణీ విభాగానికీ 'మయూరి ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్' ఏర్పాటుతో శ్రీకారం చుట్టారు.

### సినీరంగంలోనూ రామోజీ ముద్ర




ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు (88) శనివారం ఉదయం కన్నుమూశారు. ఇక రామోజీ రావు మృతితో మీడియా రంగంతో పాటు సినీ రంగం శోకసంద్రంలో మునిగిపోయింది. రామోజీరావు కెరీర్‌లో కీలక మలుపు అంటే ఈనాడు పత్రికను మొదలుపెట్టడమే. వైజాగ్ వేదికగా 1974లో ఈనాడు పత్రికను ప్రారంభించిన ఆయన దాని ద్వారా కొన్ని వేలమంది పాత్రికేయులను తయారు చేశారు. దీని తర్వాత 1995 ఆగస్టులో తెలుగు ప్రేక్షకుల కోసం ఈటీవీని ప్రారంభించారు. తక్కువ సమయంలోనే ఈ ఛానల్ అభిమానులు మనసులను దోచుకుంది. ఇక ఈటీవీలో వచ్చే రాత్రి 9 గంటల వార్తలకు అయితే ఇప్పుడు కూడా జనాలు ఆసక్తిగా చూస్తారు. మరోవైపు సినీ రంగంలో కూడా రామోజీ రావు విశేష కృషి చేశారు. తన సోంత నిర్మాణ సంస్థ ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌పై ఇప్పటివరకు వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించారు. ఈ బ్యానర్‌తోనే టాలీవుడ్ నటులు ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, దర్శక దిగ్గజం రాజమౌళి తదితరులు సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇక ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌లో చివరిగా 2015లో రాజేంద్రప్రసాద్ నటించిన దాగుడుమూత దండాకోర్ సినిమా వచ్చింది. కేవలం పెద్ద తెరకు మాత్రమే పరిమితం కాకుండా బుల్లితెరపై తన సత్తా చూపించారు. భాగవతం, అన్వేషిత, ఎండమావులు, ఆడపిల్ల, పంచతంత్రం లాంటి బ్లాక్ బస్టర్ ధారవాహికలను అందించారు. కాలంతో పాటు మారుతూ.. రీసెంట్‌గా ఓటీటీలో కూడా ఎంట్రీ ఇచ్చారు రామోజీ రావు. ఈనాడు గ్రూప్ నుంచి వచ్చిన ఓటీటీ వేదిక ఈటీవీ విన్. కేవలం తెలుగు సినిమాలతో పాటు తెలుగు ధారవాహికలు, ప్రోగ్రామ్స్ ఈ ఓటీటీలో ప్రసారం అవుతుంటాయి.

### ఒకేఒక్క సినిమాలో రామోజీ చిన్న పాత్ర

#### - మార్పు చిత్రంలో న్యాయమూర్తిగా దర్శనం




ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీ రావు ఈరోజు తెల్లవారుజామున 4 గంటల 50 నిముషాలకి కన్నుమూశారు. రామోజీ రావు, ఈనాడు దినపత్రికతోపాటు అనేక రంగాల్లో తన వ్యాపార సంస్థలు విస్తరించారు. స్వతహాగా కళాభిమాని అయిన రామోజీ రావు చిన్నతనంలో వాళ్ళ వూరిలో నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చాలా చురుకుగా పాల్గొనేవారు. అలాగే రామోజీ రావు మంచి సంగీత ప్రియుడు కూడా. రామోజీ గారికి సినిమాలంటే కూడా ఎంతో ఇష్టం. అతను ఒక సినిమాలో నటించారు కూడా. రామోజీ రావు నటించిన సినిమా పేరు ఏంటో తెలుసా? యు. విశ్వేశ్వర రావు దర్శకత్వంలో వచ్చిన 'మార్పు' అనే సినిమాలో రామోజీ రావు ఒక అతిథి పాత్రలో కనిపించారు. ఈ సినిమా 1978లో వచ్చింది. ఇందులో రామోజీ రావు న్యాయమూర్తి పాత్ర పోషించారు. రామోజీ రావు నటించింది అతిథి పాత్రలో అయినా, పోస్టర్స్ పై రామోజీ రావు బొమ్మ వేయడం ఆసక్తికరం. సినిమాలంటే ఎంతో ఇష్టమున్న రామోజీరావు ఆ తరువాత ఉషాకిరణ్ మూవీస్ సంస్థని ప్రారంభించి, మొదటి సినిమా 'శ్రీవారి ప్రేమలేఖ' తీశారు. సందేశాత్మక, వినోదాత్మక సినిమాలు మాత్రమే తీయాలన్న సంకల్పంతో ఈ సంస్థని ప్రారంభించి అనేక చిత్రాలు తీశారు రామోజీ రావు. మయూరి అనే ఫిలిం డిస్ట్రిబ్యూషన్ ఆఫీసును కూడా మొదలుపెట్టి అనేక చిత్రాలను పంపిణీ చేశారు. ఒక్క తెలుగు చిత్రాలే కాకుండా, పరభాషా చిత్రాలను కూడా తన మయూరి డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా పంపిణీ చేశారు. తన సినిమాల ద్వారా కొన్ని వందలమంది కొత్త తారలను, సాంకేతిక నిపుణలను, కళాకారులను రామోజీ రావు వెండితెరకి పరిచయం చేశారు. అగ్ర నటీమణుల్లో ఒకరైన శ్రియ శరన్ ని రామోజీ రావు పరిచయం చేసిన నటీమణి. 'ఇష్టం' సినిమా ద్వారా శ్రియ శరన్ కథానాయికగా తెలుగు తెరకి పరిచయం అయింది.






### రామోజీ మరణపై రజనీకాంత్ దిగ్భ్రాంతి

ఈనాడు గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు మృతిపట్ల కోలీవుడ్ నటుడు సూపర్ స్టార్ రజినీకాంత్ సంతాపం తెలిపారు. నా గురువు, శ్రేయోభిలాషి అయిన రామోజీ రావు గారి మరణవార్త విని నేను చాలా బాధపడ్డాను. జర్నలిజం, సినిమా, రాజకీయాల్లో గొప్ప కింగ్‌మేకర్‌గా చరిత్ర సృష్టించిన వ్యక్తి. అతను నా జీవితంలో నాకు మార్గదర్శకుడు ప్రేరణ కలిగించిన వ్యక్తి. అతని ఆత్మకు శాంతి కలుగుగాక అంటూ రజినీకాంత్ రాసుకోచ్చాడు.

### రామోజీ స్ఫూర్తిదాయక వ్యక్తి

#### - అల్లు అర్జున్ నివాళి - భారతరత్నకు అర్హుడన్న రాజమౌళి



ఈనాడు గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు మృతిపట్ల టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఎమోషనల్ పోస్ట్ చేశాడు. రామోజీ రావు మరణవార్త విని చాలా బాధపడ్డాను. నేను గౌరవించే స్ఫూర్తిదాయక వ్యక్తుల్లో ఆయన ఒకరు. మీడియా, సినిమా, ఇతర రంగాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా అంటూ అల్లు అర్జున్ రాసుకోచ్చాడు. ఈనాడు గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు మృతిపట్ల టాలీవుడ్ దర్శక దిగ్గజం రాజమౌళి సంతాపం తెలిపారు. ఈ నేపథ్యంలో ట్వీట్ ద్వారా నివాళులు అర్పించారు. రామోజీకి భారతరత్న ఇవ్వడం సముచిత గౌరవం అని అన్నారు. ఒక మనిషి అనేక రంగాల్లో వివిధ సంస్థలు స్థాపించి వాటిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాడు. వాటిద్వారా ఎన్నో లక్షలమందికి జీవనోపాధి, ఆశలను అందించి మార్గదర్శకంగా నిలిచారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వడమే సముచితమని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను అంటూ రాజమౌళి రాసుకోచ్చాడు. దీనిపై అల్లు అర్జున్ రిప్లయ్ ఇస్తూ.. నా మనసులో కూడా అదే భావన కలిగింది సార్. మీరు నా హృదయంతో మాట్లాడారు. దానికి గాత్రదానం చేసినందుకు ధన్యవాదాలు అంటూ బన్నీ తెలిపాడు.

### రామోజీ విజన్, ఆలోచనలు గొప్పవి

#### - నివాళి అర్పించిన నటుడు మోహన్ బాబు

మీడియా మొగల్ రామోజీరావు మరణవార్త విన్న నటుడు మోహన్ బాబు భావోద్వేగానికి గురయ్యారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. 'రామోజీరావు మహోన్నత వ్యక్తి. పత్రికా రంగంలో రారాజు, అలాగే ప్రపంచంలోనే అతి పెద్ద స్టూడియో రామోజీ ఫిల్మ్‌సిటీని మన దేశంలో నిర్మించారు. ఆయన విజన్, ఆలోచనా విధానం చాలా గొప్పది. ఆయనకు, నాకూ 42 ఏళ్ల నుంచి ఆత్మీయ సంబంధం ఉంది. ఎంతో ఆత్మీయంగా పలకరిస్తారు. మంచి విషయాలు చెబుతారు. నేను ఆయన దగ్గర నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. అటువంటి గొప్ప వ్యక్తి మన మధ్య లేరంటే నమ్మలేకపోతున్నా. మనసు చాలా ఆవేదనతో నిండిపోయింది. నా కుటుంబానికే కాదు. సినిమా పరిశ్రమకు తీరని లోటు. ఇది మాటల్లో చెప్పలేనిది. వారు ఎక్కడున్న వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనశ్శాంతిని ప్రసాదించాలని కోరుకుంటున్నా' అని ఆయన ట్వీట్ చేశారు.తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అన్ని విభాగములకు సంబంధించిన ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు రామోజీ రావు ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీ రావు మృతికి గౌరవ సూచకంగా ఆదివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో టాలీవుడ్‌లో అన్ని కార్యకలాపాలు మూసివేయబడతాయని పేర్కొన్నారు. అలాగే నిర్మాతల మండలి సభ్యులు కూడా రామోజీరావుకు నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు సభ్యులు.

# వయసు ముదురుతున్నా..

# పెళ్లి గురించి ఆలోచన ఏది.?

## - ఆడవారు 35 దాటిన తర్వాత పెళ్లి చేసుకోవడం ఎందుకు.?

- లేట్ మ్యారేజ్ తో అమ్మాయిల ఆరోగ్యానికి ప్రమాదం
- 37 తర్వాత పెళ్లి చేసుకుంటే అమ్మతనానికి పూర్తిగా దూరమేనా.?
- అబ్బాయిలకు ఆస్తి ఉంటే చాలు గుణం ఎలా ఉన్న పరవాలేదు
- ఆస్తి ఉన్న అబ్బాయిలకే ప్రాధాన్యత ఇస్తున్న నేటితరం యువతులు
- ఉమ్మడి కుటుంబం ఉంటే అబ్బాయిని పెళ్లి చేసుకోవడానికి వెనకడుగువేస్తున్న అమ్మాయిలు



### పెళ్లి చేసుకుంటేనే అసలైన కిక్కు

యుక్త వయసులోనైనా, కాస్త లేటుగా అయిన పెళ్లి అనేది చేసుకోవడం మంచిది. ఎక్కడో నూటికో కోటికో ఒక్కరు మాకు పెళ్లి గోల వద్దని తప్పించుకుంటారే తప్ప మిగిలిన వాళ్లకు ఆ అవకాశం ఉండదు. అటువంటి సమయంలో వయసైపోయాక పెళ్లి చేసుకోవడం కంటే. రక్తం మరిగే సమయంలో పెళ్లి చేసుకుంటేనే అసలైన కిక్కు అంటున్నారు నిపుణులు.

అధ్యయనాలు అవే చెబుతున్నాయి. యుక్త వయసులో పెళ్లి చేసుకుంటే సామాజికంగా ఒత్తిడి ఉండదు. పక్కింటివారు, ఎదురింటి వారి నుంచి ఏ బెంగ ఉండదు. 25 ఏళ్లు రాగానే, ఇక పెళ్లి చేసుకోవా.? అని ఎవరి నోటి నుండి పడితే వారి నోటి నుండి విని విని విసిగిపోయే బదులు, ఆ వయసుకే పెళ్లి చేసుకోవడం ఉత్తమమట. ముప్పై ఏళ్ల లోపు కెరీర్ సెట్ చేసుకుని. హాయిగా కాపురం చేసుకోవచ్చని సర్వేల అభిప్రాయం.

### ఈ లేట్ ప్రెగ్నెన్సీ మంచిదేనా.?

లేట్ ప్రెగ్నెన్సీ అనేది స్త్రీ ఆరోగ్యంపై పూర్తిగా ప్రభావం చూపిస్తుంది. చాలామంది వైద్యులు 35 సంవత్సరాల తర్వాత ప్రెగ్నెంట్ అయితే కాంప్లికేషన్స్ ఎక్కువగా ఉంటాయని చెప్తున్నారు. కొందరికి అన్ని సమస్యలు లేకపోయినా మరికొందరికి కచ్చితంగా ఉంటాయంటున్నారు. మహిళలే కొన్ని విషయాలు సర్దుకుపోయి త్వరగా పెళ్లిళ్లు చేసుకుంటే వాళ్ల ఆరోగ్యానికి కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందని అధ్యాయనాలు వెల్లడిస్తున్నాయి.



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ఒక వయస్సు వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరు పెళ్లి చేసుకుని జీవిత భాగస్వామితో పిల్లలను కని సంతోషంగా ఉండాలని భావిస్తూ ఉంటారు. ప్రస్తుతం యువత పెళ్లి మాట ఎత్తితే చాలు కిలోమీటర్ దూరం పరుగులు పెడుతూ ఉన్నారు. ఎన్నిసార్లు పెళ్లి గురించి ప్రశ్నించిన ఏదో ఒకటి చెప్పి తప్పించుకుంటున్నారు. దానితో వయసు మీద పడిపోయి 35, 40 సంవత్సరాలు వచ్చిన తర్వాత పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

### యుక్త వయసులోనే పెళ్లి చేసుకుంటే ఎన్నో లాభాలు

ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలంటారు పెద్దలు. యుక్త వయసులోనే పెళ్లి చేసుకుంటే ఎన్నో లాభాలున్నాయి. 'అన్ని విషయాల్లోనూ అనుభవం' కూడా మీ సొంతమవుతుంది.

అదొక్కటే కాదండోయ్ యవ్వనంలో వివాహం చేసుకుంటే కలిగే లాభాలేంటో ఒకసారి చూద్దాం. చిన్న వయసులో పెళ్లి చేసుకుంటే కెరీర్ పాడవుతుందని లేని పోని బాధ్యతలు మీద పడి జీవితం అసలు రుచిని అనుభవించలేమని కొందరి వాదన. అందుకే చాలా మంది యువత ముదిరి బెండకాయలవుతున్నా పెళ్లి గోల ఎందుకుని వాయిదాల మీద వాయిదాలు వేస్తుంటారు. ఇలా వాయిదాలతో ప్రయోజనాలేమో గానీ నష్టాలే ఎక్కువగా ఉంటాయి. తాజాగా ఒక సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైంది.

### ఆడవారు 35 దాటితే పెళ్లి చేసుకోవడం ఎందుకు.?

ప్రతిదానికి లిమిట్ ఉన్నట్లే స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థకి కూడా కొన్ని కండీషన్స్ ఉన్నాయంటుంది. ఆఫీస్ ఫర్ నేషనల్? స్టాటిస్టిక్స్ విడుదల చేసిన ఓ అధ్యయనంలో మహిళలు 35 సంవత్సరాలు దాటిన తర్వాత పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని చిన్నచిన్న పట్టింపులకు కూడా మహిళలు పెళ్లికి నిరాకరించడంతో లేటుగా మ్యారేజ్ చేసుకొని అమ్మ తనానికి చాలామంది దూరమవుతూ సంతాన సాఫల్య కేంద్రాల చుట్టూ తిరుగుతూ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. మహిళలు 35 సంవత్సరాల లోపే పెళ్లిళ్లు చేసుకోవడం వాళ్ళ ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు కూడా చెబుతూనే ఉన్నారు. పెళ్లిళ్ల విషయంలో అమ్మాయిల నిర్లక్ష్యంతో చరిత్రలో ఎప్పుడూ లేనంతగా లేట్? మామ్? అనే ధోరణి జరుగుతోందని తెలిపింది.

### అత్యాశలే లేట్ మ్యారేజ్ కి కారణమా.?

ఇటీవల కాలంలో అమ్మాయిలకు, అబ్బాయిలకు అత్యాశలు చాలా పెరిగిపోతున్నాయి.

ఆస్తులపై, సంపాదనపై కార్లు ఇలా సుఖాలను వెతుక్కుంటూ పెళ్లికి దూరమవుతున్నారు. విదేశీ సంబంధాలు, కోట్ల విలువ చేసే భూములు ఉండాలంటూ దానితోపాటు ఉమ్మడి కుటుంబం వద్దంటూ అమ్మాయిలు చూడడంతో పెళ్లిళ్లకు దూరమవుతున్నారు. గతంలో అబ్బాయి పెళ్లి చేసుకొని అమ్మాయిని పోషిస్తే చాలు అనే నమ్మకంతో పెళ్లిళ్లు జరిగేవి కానీ ఎమ్ ఎన్ సి కంపెనీల తర్వాత అమ్మాయిల ప్రవర్తనలో పూర్తిగా మార్పు వచ్చి అత్యాశతో పెళ్లిళ్లకు దూరమవుతన్నారు.

### ఎగ్ క్వాలిటీ తగ్గుతుంది

ముఖ్యంగా స్త్రీ విడుదల చేసే అండాశయం, గుడ్డు నాణ్యత, ఓసైట్ నాణ్యత 35 సంవత్సరాల తర్వాత తగ్గిపోతూ ఉంటుంది. 37 సంవత్సరాలు దాటితే అది దాదాపు క్షీణిస్తుంది.

ఇది క్రోమోజోమ్ అసాధారణతల ప్రమాదాన్ని పెంచుతుందని గైనకాలజిస్ట్?లు చెప్తున్నారు. అంతేకాకుండా వయసు దాటాక పుట్టే పిల్లలు డౌన్ సింద్రోమ్ వంటి అసాధారణ లక్షణాలతో పుట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. తల్లి వయసు పెద్దది అయితే డౌన్ సింద్రోమ్ ఏర్పడుతుందని డాక్టర్లు తెలుపుతున్నారు.

# మోడీది మూన్నాళ్ల ముచ్చటే

## - ఎప్పటికైనా ఇండియా కూటమిదే అధికారం
## - మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా (ప్రశ్న న్యూస్) :** బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఏర్పాటు చేసే ప్రభుత్వంది మూన్నాళ్లత ముచ్చటే అని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో రాబోయేది ఇండియా కూటమి ప్రభుత్వం అంటూ సంచలన ప్రకటన చేశారు. మోడీ ఆదివారం మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసేందుకు నరేంద్ర మోదీ రెడీ అవుతున్నారు. ఇలాంటి తరుణంలో.. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీ చట్టవిరుద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని.. కొన్నిసార్లు ప్రభుత్వాలు కేవలం ఒక్క రోజు మాత్రమే ఉంటాయని కుండబద్దలు కొట్టారు. భవిష్యత్తులో ఇండియా కూటమి తప్పకుండా కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆమె జోస్యం చెప్పారు. శనివారం తృణమూల్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. 'ఎన్నికల ర్యాలీల్లో 'అబ్‌కీ బార్ 400 పార్' అని ప్రచారం చేసిన బీజేపీ.. కనీసం సాధారణ మెజారిటీ మార్క్‌ని (272) కూడా అందుకోలేకపోయింది. ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనంత మాత్రాన ఏమీ జరగదని అనుకోకండి. ఎందుకంటే.. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. కచ్చితంగా ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అయితే.. కొన్నాళ్లు వారిని అధికారంలో ఉండనివ్వండి. కొన్నిసార్లు ప్రభుత్వాలు ఒక్క రోజు మాత్రమే ఉంటాయి. ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చు. ప్రస్తుత ప్రభుత్వం 15 రోజుల వరకైనా ఉంటుందో ఉండదో ఎవరికి తెలుసు?' అని చెప్పుకొచ్చారు. బీజేపీ అప్రజాస్వామికంగా, చట్టవిరుద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రంలో ఈ బలహీనమైన, అస్థిరమైన ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోతే.. తాను చూసి సంతోషిస్తానని పేర్కొన్నారు. దేశానికి మార్పు కావాలని, దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఉందని, కాబట్టి ఆయన ఈసారి ప్రధాని కాకూడదని సూచించారు. అంతేకాదు.. ఆదివారం సాయంత్రం జరగబోయే మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా తాను హాజరుకానని తేల్చి చెప్పారు. అప్రజాస్వామికంగా ఏర్పడుతున్న ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పలేమని, వాళు మళ్లీ పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తారని ఆరోపించారు.

# కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సోనియా



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) :** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ ఎంపికయ్యారు. శనివారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని జరిగింది. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, శశి థరూర్, అజయ్ మాకెన్, కార్తీ చిదంబరం, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ఛైర్‌పర్సన్‌గా సోనియా గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదట ఆమె పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆ తర్వాత నేతలు గౌరవ్ గొగోయ్, తారిఖ్ అన్వర్, కె సుధాకరన్ ప్రతిపాదించగా.. ఎంపీలు సమర్థించి తీర్మానం చేశారు. కాగా, ఈరోజు ఉదయం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్ గాంధీని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. త్వరలో అధికారికంగా వెల్లడించనున్నట్లు కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.

# ముందు జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్

- వాతావరణ మార్పులే సీజనల్ వ్యాధులకు కారణం
- గాలిలో ఒక్కసారిగా తేమ శాతం పెరగడంలో శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశాలు
- గాలి, నీరు, దోమలే పలు వ్యాధులకు మూల కారణం
- వర్షాకాలంలో నీటినినిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వర్షాకాలంలో పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- సీజనల్ వ్యాధుల నుండే రక్షణ పొందేందుకు పిల్లలుకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వాతావరణంలో ఏర్పడిన మార్పులతో సహజంగానే ప్రజల్లో రోగ నిరోధక శక్తి కొంతమేరకు తగ్గిపోవడంతో జబ్బుల బారిన పడే ప్రమాధం పొంచి ఉంది. ఏప్రిల్, మే నెలల్లో అస్తవ్యస్తం చేసిన మండే ఎండలకు తెరదించుతు జూన్ మొదటి వారంలోనే తొలకరి పలకరించడం శుభసూచకం. నిప్పుల కుంపటిని తలపించే వాతావరణం నెమ్మదిగా చల్లబడుతు చాలా ఆహ్లాదకరంగా మారిపోతుంది. అయితే వాతావరణంలో తేమ పెరిగి గాలి చల్లబడి పోవడం, వర్షాలకు మడుగులు, కుంటలు, చెరువులు, మురుగు కాలువలు నీటితో నిండిపోవడం వల్ల దోమలు, ఈగలు సహా రోగ కారక క్రిములు వృద్ధి చెందుతాయి. వీటివల్ల జలుబు, దగ్గు, జ్వరం, డెంగీ, మలేరియా వంటి రుగ్మతలు చుట్టుముడతాయి. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడే ప్రమాధకర పరిస్థితులు పొంచి ఉన్నాయి.

### సీజనల్ వ్యాధులు..

సీజనల్ వ్యాధులు అంటే ఏమిటి, ఎలాంటి రోగాలు వస్తాయనే వాటికి ప్రత్యేక కారణాలేమిటి, అవి సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి అనే తదితర అంశాలను చూస్తే సీజనల్ వ్యాధులకు గాలి, నీరు, దోమలే ప్రధాన కారణం. వేసవి తరువాత వాతావరణం హఠాత్తుగా మారిపోవడం, అప్పటి వరకు ఉక్కపోత, వేడిగాలులతో నిండిన వాతావరణం చల్లబడి పోతుంది. దీనికితోడు వర్షాల వల్ల కొత్తనీరు రావడంతో నాలాలు, కుంటల్లో దోమలు, ఈగల వృద్ధి జరుగుతుంది. ఫలితంగా, సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి.

### గాలి వల్ల..

వేసవి కాలంలో వాతావరణంలో తేమ 20-30 శాతం కంటే తక్కువే ఉంటుంది. అయితే, వర్షాకాలం ప్రారంభంతో ఒక్కసారిగా 80 శాతానికి మించి పెరుగుతుంది. ఆ ప్రభావంతో చలి గాలులు వీయడం, ఆ గాలి పీల్చడం వల్ల ముఖ్యంగా పిల్లల్లో ముక్కులో ఉండే ఎడినాయిడ్స్ కండరాలు, గొంతులో ఉండే టాన్సిల్స్ ఉబ్బుతాయి. దీంతో జలుబు, దగ్గు వంటి సమస్యలు వచ్చి, ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుంది. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ పెరిగితే అది న్యుమోనియాకు దారితీసే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లలు చల్లగాలికి తొందరగా ఆకర్శితులై వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చల్లటి గాలి వల్ల పిల్లల్లో జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటి సీజనల్ వ్యాధులు వచ్చే ఆస్కారం అధికం. ముఖ్యంగా పాఠశాలలో పిల్లలు తుమ్మినా, దగ్గినా జలుబు, దగ్గు, స్వైన్‌ఫ్లూ, కరోనా వంటి వైరస్ లు గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతాయి. తరగతి గదుల్లో పిల్లలు దగ్గర దగ్గరగా కూర్చోవడం, కలిసి ఆడుకోవడం వల్ల అంటు వ్యాధులు ప్రబలుతాయి. కాబట్టి, వర్షాకాలంలో పిల్లలను కంటికిరెప్పలా చూసుకోవాలి. బడికి వెళ్లేముందు తగిన జాగ్రత్తలు చెప్పాలి. మాస్క్ లాంటివి తప్పకుండా ఇచ్చి పంపాలి

### నీటి ద్వారా..

వర్షాల కారణంగా చెరువులు, కుంటలు తదితర జలాశయాలలో కొత్తనీరు వచ్చి చేరుతుంది. ఈ నీటిని ఎంత వడపోసినను ఎక్కడో ఒక దగ్గర నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంటుంది. కలుషితమైన నీరు అనేక వ్యాధులకు ప్రధాన కారణం. జీర్ణకోశ వ్యాధులైన వాంతులు, విరేచనాలు, కలరా, పచ్చకామెర్లు, అమీబియాసిస్ వంటివి అధికంగా వస్తాయి. విరేచనాలు ఎక్కువగా కావడంతో జనాల్లో డీహైడ్రేషన్ బారిన పడతారు. అలాగే వర్షాకాలంలో ఈగల బెడద కూడా ఎక్కువే. కలుషిత నీరు, కలుషిత ఆహారం వల్ల ఎక్కువగా పచ్చకామెర్లు, టైఫాయిడ్ వంటివి పిల్లలపై దాడిచేస్తాయి. సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీరే ఇవ్వాలి.

### దోమలు..

సీజనల్ వ్యాదులు ప్రబలడానికి దోమలు ప్రధాన కారణం. వర్షాల వల్ల వచ్చే కొత్త నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందడంతో ప్రజల్లో పలు రకాల అంటురోగాలు వ్యాప్తి చెందుతాయి. దోమలను రెండు రకాలుగా విభజించారు. ఒకటి, రాత్రిపూట కుట్టే దోమలు. రెండు, పగటి వేళ కుట్టేవి. అనాఫిలిస్, క్యూలెక్స్ దోమలు రాత్రిపూట కుడతాయి. వీటి వల్ల మలేరియా, ఫైలేరియా (బోధకాలు), మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయి. దేశ రాజధాని ఢిల్లీ, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో 'ఈడిస్ట్ ఈజిప్టె' దోమల ప్రభావం అధికం. ఇవి పగలు మాత్రమే కుడతాయి. ఇతర దోమల్లా మురుగు నీటిలో ఉండవు. నిల్వ ఉన్న మంచి నీటిలో అంటే ఇళ్లలోని పూల కుండీలు, కూలర్‌లు, ఇంటి పరిసరాల్లో నీరు నిలిచిన కుంటలు, రబ్బరు టైర్లు వంటివాటిలో ఉన్న నీటిలో వృద్ధి చెందుతాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పిల్లలు డెంగీ వ్యాధి బారినపడే ఆస్కారం ఉంది. ఐదేండ్ల లోపు పిల్లలకు మెదడువాపు ప్రధాన శత్రువు. ఈ వ్యాధికి పందులే వాహకాలు. కాబట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఉత్తమం.

### టీకాతో రక్షణ..

సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి కొన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందు పిల్లలకు ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ వేయించడం ఎంతో అరసరం. దీనివల్ల పలు రకాల ఫ్లూ జ్వరాల నుంచి రక్షణ లభిస్తుంది. ఐదేండ్ల లోపు పిల్లలకు టైఫాయిడ్ వ్యాక్సిన్ వేయించాలి. పసిరికల (జాండిస్) నుంచి రక్షణ పొందడానికి హెపటైటిస్-ఎ వ్యాక్సిన్ ఇప్పించాలి. ఇలాంటి ముందు జాగ్రత్త చర్యల ద్వారా పిల్లలను వానాకాలం వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588